ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 10.04.2026 | సంపుటి : 12 సంచిక : 261 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



# కాళేశ్వరం మరమ్మతులపై సీఎం సమీక్ష

- దెబ్బతిన్న బ్యారేజీల మరమ్మతులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు పూర్తిచేయాలి
- పనులను నిరంతరం పర్యవేక్షించాలి : సీఎం రేవంత్
- సమావేశానికి హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీలకు మరమ్మతులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. కాళేశ్వరం మరమ్మతులపై నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు సమావేశానికి హాజరయ్యారు."బ్యారేజీల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. వీలైనంత త్వరగా మిగతా 2లో..

## మూడు రాష్ట్రాల్లో వెల్లివిరిసిన
# ఓటరు చైతన్యం

### కేరళ,అస్సాం,పుదుచ్చేరి అసెంబ్లి ఎన్నికల్లో భారీ ఓటింగ్





- ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు
- ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పలువురు ప్రముఖులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ మిగతా 2లో..

# తిరుగులేని తెహరాన్



## 40 రోజుల యుద్ధంలో హీరో 'ఇరాన్'

- అణ్వాయుధ సామర్థ్యాలను పెంచుకోవడానికి మరింత ఉత్సాహం
- పెరిగిన ఆత్మవిశ్వాసం.. ఉక్కిరిబిక్కిరైన ట్రంప్ యంత్రాంగం
- తమ సైనిక బలగాల నియంత్రణలోనే హర్మ్యూజ్ జలసంధి
- అమెరికా కఠిన షరతులను నిర్ద్వంద్వంగా తిరస్కరణ
- అపరిష్కృత ప్రశ్నలుగానే అగ్రరాజ్యం వాదనలు

**ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా అంచనాలను తలకిందులు చేస్తూ, తన సైనిక పటిమతో ఇరాన్ సత్తా చాటింది. సుమారు 40 రోజుల పాటు సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పోరాడి, అగ్రరాజ్యాన్ని విస్తుపోయేలా చేసింది. టెక్నాలజీ పరంగా అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాలు ఎంతటి ఆధిక్యతను ప్రదర్శించినా, అపారమైన ఆత్మవిశ్వాసంతో ఎదురొడ్డి నిలిచిన తెహరాన్, ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది.**

**టెహరాన్/వాషింగ్టన్ (జనంసాక్షి) :** ఇరాన్‌లో పాలన మార్పు వస్తుందని, 47 ఏళ్ల నియంతపాలనకు ముగింపు పలుకుతామని యుద్ధానికి ముందు ట్రంప్ చెప్పిన మాటలివి. కానీ, 40 రోజుల యుద్ధం ఆ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ట్రంప్ మాత్రం పూర్తిగా పాలన మారిపోయిందని ప్రకటన చేయడం గమనార్హం. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైన రోజే ఇజ్రాయెల్- అమెరికా దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. కానీ, ఆయన వారసుడిగా రెండో కుమారుడు మోజ్తాబా ఖమేనీ సుప్రీం లీడర్‌గా ఎన్నికవడం, ఇరాన్‌లో నాయకత్వ మార్పు జరిగినా.. విధానాలు అదేస్థాయిలో కొనసాగడం ప్రపంచదేశాలను ఆశ్చర్యపరిచింది.

**టెహ్రాన్‌లో పెరిగిన ఆత్మవిశ్వాసం**

యుద్ధం మొదట్లో ఇరాన్ ప్రభుత్వంపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ, శత్రువుల దాడులతో దేశ ప్రజలంతా ఏకమయ్యారు. ఈ యుద్ధం ఇరాన్ పౌరుల్లో సరికొత్త దేశభక్తిని నింపింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్ జీసీ) అందించిన భరోసాతో, భవిష్యత్తులో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమన్న ధీమాను దేశం దక్కించుకుంది. కీలక నేతలను కోల్పోయినప్పటికీ, శత్రువుకు లొంగిపోయే ప్రసక్తే లేదని ఇరాన్ కుండబద్దలు కొట్టింది.ఇరాన్ చాలా బలహీనమైన దేశమని భావించిన డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి ఈ 40 రోజుల యుద్ధం ఒక గుణపాఠంగా మారింది. ఇరాన్ వేసిన వ్యూహాత్మక అడుగులు అమెరికాను ఆత్మరక్షణలో పడేశాయి.



**హార్ముజ్ జలసంధిపై పట్టు**

ఈ కీలకమైన జలసంధి గుండా నౌకల రాకపోకలను తమ సైనిక బలగాల నియంత్రణలోనే ఉంచుతామని ఇరాన్ స్పష్టం చేసింది. సుంకాల వసూలు పేరుతో దీనిని తమ ఆర్థిక వనరుగా మార్చుకోవాలని కూడా ఇరాన్ భావిస్తోంది. అదేవిధంగా అమెరికా విధించిన కఠినమైన 15 షరతులను మిగతా 2లో..

# ఆర్టీసీలో సమ్మె సైరన్

- 23 తర్వాత ఎప్పుడైనా బంద్
- 13 తర్వాత సమ్మెపై స్పష్టత ఇస్తామన్న ఆర్టీసీ జేఏసీ నేతలు
- ఇప్పటికే నోటీసు ఇచ్చామని వెల్లడి
- కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్

**హైదరాబాద్(జనంసాక్షి):** ఈనెల 23 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డిలు స్పష్టం చేశారు. ఆర్టీసీక్రాస్ రోడ్ లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు ఇవాళ సమావేశమయ్యారు. దీనికి ఆర్టీసీ అధికారులు రాకపోవడంతో సమ్మెపై పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని జేఏసీ నేతలు మిగతా 2లో..




## ముఖ్యమంత్రి
# మాట్లాడాలి

### పొంగులేటిపై మండిపడ్డ హరీశ్‌రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్‌తోపాటు తనపై మంత్రి పొంగులేటి చేసిన ఆరోపణలపై హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు."మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలి. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటి. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుంది?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. పొంగులేటి కాదు మిగతా 2లో..





## ఆరోపణలు కాదు..దమ్ముంటే
# చర్చకు రావాలి

### పొంగులేటిపై హరీశ్ ఆరోపణలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు

**హైదరాబాద్(జనంసాక్షి):** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. మిగతా 2లో..

## శాశ్వత ఒప్పందం కుదిరితేనే మా బలగాలు
# వెనుదిరుగుతాయి



### ట్రంప్ సంచలన ప్రకటన

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్-అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటా యని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒక వేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం.



## సందిగ్ధ పరిస్థితుల్లో శాశ్వత శాంతి ఒప్పందం
# అసమంజసమే

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో మండిపడుతున్న ఇరాన్
- బీరూట్‌లో 254 చేరుకున్న మృతుల సంఖ్య.. వెయ్యి మందికి పైగా గాయాలు
- హర్మ్యూజ్ మూసివేత నిర్ణయంతో వెనుదిరుగుతున్న నౌకలు
- జలసంధి గుండా వచ్చే నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలి.. ఇరాన్ మరో ప్రకటన
- ఆంక్షలతో విజయం సాధించలేరు
- ఇరాన్ అణు ఇంధన సంస్థ చీఫ్

2లో..

## గెలిస్తే ఆరు గ్యారెంటీలు
# అమలుచేస్తాం

- ఈ సారి బెంగాల్ అంతటా నందిగ్రామ్‌లో ఫలితమే పునరావృతమవుతుంది
- పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 5ఏళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓటమిని గుర్తు చేస్తూ.. ఈసారి బెంగాల్ అంతటా అదే ఫలితం వస్తుందని ధీమా మిగతా 9లో..





# మోదీ పాలన నచ్చిందట! బీఆర్ఎస్‌లో చేరుతారట!

- కేసీఆర్‌తో కలసి రాష్ట్రం కోసం పనిచేస్తా
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

**జగిత్యాల(జనంసాక్షి):** తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడవచ్చని అన్నారు. 27 నెలలుగా చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గురయ్యాను. బీఆర్ఎస్ మిగతా 2లో..

## ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు
# నమ్మొద్దు

స్పష్టం చేసిన తెలంగాణ ఇంటర్ బోర్డు

## జూన్ 2 నుంచి స్కూల్
# విద్యార్థులకు అల్పాహారం

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం : డిప్యూటీ సీఎం భట్టి

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

'శబరిమల' అంశంపై కేంద్రం మరోసారి సమర్థన

వివరాలు 2వ పేజీలో..

## పాక్ మధ్యవర్తిత్వం..
# అమెరికా,ఇరాన్ మధ్య తొలిదశ చర్చలు

వాన్స్ నేతృత్వంలో ఇస్లామాబాద్ వేదికగా శనివారం తొలి సమావేశం

2లో..

### ఇంధన కొరత ఆందోళనలు..



# గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు

హర్మ్యూజ్‌లో భారత నావికులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ



## లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలకు
# ఇజ్రాయెల్ అనుమతి



- ప్రకటించిన ప్రధాని బెంజమిన్ నెతన్యాహు
- వీలైనంత త్వరగా సంప్రదింపులు ప్రారంభించాలని ఆదేశాలు
- ఈ విషయమై ఇంకా స్పందించని లెబనాన్

**టెల్అవీవ్(జనంసాక్షి):** లెబనాన్‌తో నేరుగా చర్చలు ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చి నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. వీలైనంత త్వరగా ఈ చర్చలు ప్రారంభించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. లెబనాన్ తరఫున వచ్చిన అభ్యర్థనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇరు దేశాల మధ్య శాంతి సంబంధాలను నెలకొల్పడం కూడా ఈ చర్చల ప్రధాన లక్ష్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై లెబనాన్ నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10.04.2026

## కాళేశ్వరం మరమ్మతులపై సీఎం సమీక్ష

పనులు వేగవంతం చేయాలి. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలి. వర్షాకాలానికి ముందే పరీక్షలు, నమూనాల సేకరణ పూర్తి చేయాలి. సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, నీటిపారుదలశాఖ, డిజైన్ కన్సల్టేషన్స్‌తో బృందం ఏర్పాటు చేయాలి. ప్రతి పనిలో సీడబ్ల్యూసీ సభ్యులు ఉండేలా చూడాలి. బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు, డిసెంబర్‌లోపు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలి. నిధుల కొరత రానివ్వం.. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. పనులు ప్రారంభమయ్యాక స్వయంగా వచ్చి పరిశీలిస్తా"అని సీఎం అన్నారు.

## ముఖ్యమంత్రి మాట్లాడాలి

ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యంగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పంపించి, కాంపౌండ్ వాల్ కూలగొట్టి, ఆక్రమణలను కూల్చి రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలన్నారు. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటీ అని దుయ్యబట్టారు. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుందని హరీశ్ రావు ప్రశ్నించారు.

## ఆరోపణలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమి లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు.

**సీఎం రేవంత్‌పై జీవన్ రెడ్డి విమర్శలు సరికాదు: మంత్రి జీవన్ రెడ్డి**

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జీవన్ రెడ్డి అనడం సరికాదని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని చెబుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై జీవన్‌రెడ్డి విమర్శలు చేశారు. ఈ క్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విలేకర్ల సమావేశంలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిని ఓడించడమే ధ్యేయమని జీవన్ రెడ్డి అనడం సరికాదు. ఆయన ఎన్నికల్లో ఓడిన పది నిమిషాలకే రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఓడినా మంత్రి పదవి ఇస్తామని అన్నారు. ఓడినవారికి మంత్రి పదవి ఇవ్వకూడదన్న ఏఐసీసీ నిబంధన వల్లే ఇవ్వలేదు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.

## పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10–50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది.'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈసందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు."మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.శబరిమలలో 10–50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# తిరుగులేని తెహరాన్

ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అణు కార్యక్రమాలను పూర్తిగా వదులుకోవాలన్న ప్రతిపాదనను పక్కన పెట్టి, తన సొంత అజెండాతో ముందుకు వెళ్తోంది. ఇరాన్ ప్రతిపాదించిన 10 షరతులపైనే ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఎక్కువగా చర్చ జరుగుతోంది.

వారసత్వ పోరులోనూ స్పష్టత

యుద్ధం తొలి రోజుల్లోనే కీలక నాయకత్వ మార్పులు జరిగినప్పటికీ, ఇరాన్ తన పటిమను కోల్పోలేదు. అయాతుల్లా అలీ ఖమేనీ వారసుడిగా వచ్చిన ముజ్తాబా అమెరికా పట్ల మరింత కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. దీంతో ఇరాన్ వ్యూహాల్లో మరింత పదును పెరిగింది. అలాగే ఇరాన్ అణు ఆశయాలను నిలిపివేయడం లేదా దాని బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని రద్దు చేయడం వంటి ట్రంప్ వాదనలు నేటికీ అపరిష్కృత ప్రశ్నలుగానే మిగిలిపోవడం అగ్రరాజ్యానికి చెంపపెట్టులాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సందిగ్ధ పరిస్థితుల్లో శాశ్వత శాంతి ఒప్పందం అసమంజసమే

టెహ్రాన్(జనంసాక్షి):కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా.. ఇరాన్ మిత్రపక్షాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. దీనిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో శాశ్వత శాంతి ఒప్పందం అసమంజసమే అవుతుందని వ్యాఖ్యానించింది. సీజ్‌ఫైర్‌లోని పలు షరతులను నెతన్యాహు ప్రభుత్వం ఉల్లంఘించిందని దుయ్యబట్టింది. ఇరాన్ హెజ్‌బొల్లాకు అండగా నిలుస్తుందని ఐఆర్‌జీసీ వెల్లడించింది. సీజ్‌ఫైర్ విఫలమైతే ఆ బాధ్యత అమెరికాదే అని హెచ్చరించింది.

సీమైన్స్ ఎఫెక్ట్.. హర్మూజ్‌పై ఇరాన్ మరో ప్రకటన..! హర్మూజ్ జలసంధి గురించి ఇరాన్ మరో కీలక ప్రకటన చేసింది ఆ జలసంధి మీదుగా ప్రయాణించే నౌకల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రకటించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణల్లో భాగంగా అమెరికా దాని, మిత్రదేశాల నౌకలను అడ్డుకునేందుకు ఇరాన్ దానిలో సీమైన్స్ పరిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు నౌకలు వాటి బారినపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ప్రకటన చేసింది. "సముద్ర భద్రతా సూత్రాలకు అనుగుణంగా సీమైన్స్ నుంచి రక్షణ కోసం హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలి" అని ఐఆర్‌జీసీ ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరాన్–అమెరికా రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. దాంతో యుద్ధం తాత్కాలికంగా ముగిసినట్లు కనిపించింది. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా కనిపిస్తోంది. వాషింగ్టన్‌తో ఒప్పందం షరతులకు లోబడి హర్మూజ్‌ను తెరిచిన టెహ్రాన్.. లెబనాన్‌లో దాడులకు ప్రతిగా ఆ జలసంధిని తిరిగి మూసేసింది. కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. మరోసారి హర్మూజ్ మూసివేతపై కొన్ని గంటల క్రితం ఇరాన్ నుంచి ప్రకటన రాగా.. మళ్లీ ఇప్పుడు ఆ దేశం ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిందంటూ వార్తలు రావడం గందరగోళాన్ని సృష్టిస్తోంది.

**హర్మూజ్ నుంచి నౌకలు తిరుగుబాట**

కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనికి సంబంధించిన కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జలసంధిని పూర్తిగా మూసేయడంతో.. దీని మీదుగా వెళ్లాల్సిన నౌకలు బలవంతంగా వెనక్కి మరలుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. గ్రీక్‌కు చెందిన బల్క్ క్యారియర్ లైబీరియా జెండా కలిగిన 'ఆజీఎబీనీనిజీ ఃవజీఇష్ట్ర' అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటాయి. కాల్పుల విరమణ తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ క్రమంలో అనే చమురు నౌక కూడా జలసంధిని దాటేందుకు సిద్ధమైంది. అయితే, అప్పటికే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో.. ఇరాన్ హర్మూజ్‌ను పూర్తిగా మూసివేసింది. దీంతో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక బలవంతంగా వెనుదిరగాల్సి వచ్చింది. అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. దీంతోపాటు మరికొన్ని నౌకలు కూడా ఇలానే వెనుదిరిగినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

**ఆంక్షలతో విజయం సాధించలేరు**

ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అన్నారు. అమెరికాతో జరిపే ఎటువంటి కాల్పుల విరమణ చర్చల్లోనూ తమ హక్కుల పరిరక్షణే అత్యవసర అంశంగా ఉండాలని చెప్పారు. తమపై ఆంక్షలు విధించి శత్రువులు విజయం సాధించలేరన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో యురేనియం శుద్ధి అంశాన్ని అమెరికా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇరాన్ అణు ఇంధన సంస్థ చీఫ్ ఎస్లామీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఇంధన కొరత ఆందోళనలు.. గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా– ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటనకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా.. ఇరాన్ ప్రతీకార దాడులకు గురైన గల్ఫ్ దేశాల్లో ఖతార్ కూడా ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో ఎల్ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉత్పత్తులను పునఃప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత కార్యకలాపాలే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకొంది. యూఏఈకి జైశంకర్..

భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11–12 తేదీల్లో జై శంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ పేర్కొంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో.. భారత్‌లో ఇటీవల ఎల్ఎన్‌జీ కొరతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. అయితే, కేంద్రం ఈ ఆందోళనలను కొట్టిపారేసింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉన్నాయని, కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారాలు నిరాధారమైనవని స్పష్టం చేసింది.

## పాక్ మధ్యవర్తిత్వం.. అమెరికా,ఇరాన్ మధ్య తొలిదశ చర్చలు

టెహ్రాన్(జనంసాక్షి):ఇస్లామాబాద్ వేదికగా అమెరికా– ఇరాన్ మధ్య తొలి దశ చర్చలు ఈ శనివారం ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో అమెరికా బృందం ఈ చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. కాగా ఇరాన్‌తో కాల్పుల విరమణ కుదిరిన నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మూడు వర్షన్లలో తన 10 పాయింట్ల ప్రతిపాదనలు పంపిందన్నారు. అందులో ఒకటి చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని మీడియాతో అన్నారు. ఇరాన్ నుంచి వచ్చిన మూడు వేర్వేరు ప్రతిపాదనలు గందరగోళాన్ని సృష్టించాయని వాన్స్ పేర్కొన్నారు. తొలుత 10 పాయింట్లతో ఒక ప్రతిపాదనను పంపించినట్లు వెల్లడించారు. అయితే, అది చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లకు ఆ ప్రతిపాదనలు అందాయన్నారు. వెంటనే వారు వాటిని తిరస్కరించినట్లు వెల్లడించారు. ఇరాన్ ప్రతిపాదనలకు సంబంధించిన రెండో వర్షన్ కూడా ఉందన్నారు. కాల్పుల విరమణ ప్రకటనలో అధ్యక్షుడు ట్రంప్ దాన్నే ప్రస్తావించారన్నారు. ప్రతిపాదనలకు సంబంధించిన మూడో వర్షన్ మొదటి దానికంటే అత్యంత దారుణంగా ఉందని, అంగీకరించలేనివిధంగా అందులో డిమాండ్లు ఉన్నాయన్నారు. సోషల్ మీడియా ద్వారా ఈ మూడో ప్రతిపాదన గురించి తమకు తెలిసిందన్నారు. లెబనాన్ కారణంగా.. కాల్పుల విరమణ విఫలం కాకుండా చూడాలని వాన్స్ ఇరాన్‌ను కోరారు. ఈ సీజ్‌ఫైర్ నిబంధనల్లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాల గురించి చేర్చలేదన్నారు. ఇదిలా ఉండగా అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## వరి కొనుగోళ్ల గడువు మరో 2 నెలలు పెంచాలి

**కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ**

హైదరాబాద్(జనంసాక్షి): వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడువు పెంచాలని కోరారు. రబి 2024–25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025–26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒఓఌలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

## ఆర్టీసీలో సమ్మె సైరన్

తెలిపారు.ఈనెల 13వ తేదీన మరో సారి లేబర్ కమిషనర్, ఆర్టీసీ యా జమాన్యంతో చర్చలు ఉంటాయని ఆతర్వాత సమ్మెపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించి తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్మిక శాఖకు, తమ యాజమాన్యానికి సమ్మెనోటీస్ ఇచ్చామని తెలిపారు.

## జూన్ 2 నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

ఖమ్మం(జనంసాక్షి): కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్దంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు.

## మూడు రాష్ట్రాల్లో వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది మొత్తం 296 నియోజకవర్గాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మధ్యాహ్నం 1 గంట వరకు నమోదైన పోలింగ్ శాతాలను ఎన్నికల సంఘం వెల్లడించింది. అస్సాంలో 59.6 శాతం, కేరళలో 47.3 శాతం, పుదుచ్చేరిలో 56.8 శాతం రికార్డయింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఇతర మంత్రులు, నటులు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్, మమ్ముట్టి, నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపి వంటివారు ఓటేశారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ ఆకట్టుకుంది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్ గౌరవ్ గొగొయ్ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇది అస్సాంకు ఎంతో ముఖ్యమైన రోజు అని గొగొయ్ అభివర్ణించారు. ఓటింగ్ వేళ.. పుదుచ్చేరిలోని బహూర్ ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఆ కేంద్రపాలిత ప్రాంతంలోని అధికార పార్టీ ఆల్‌ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ మద్దతుదారులు గిఫ్ట్ కూపన్లు పంచినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ రోజు ఉదయం వాటిని పంచినట్లు తెలుస్తోంది. అస్సాంలో భాజపా, కాంగ్రెస్ మధ్య పోరు నడుస్తోంది. కేరళలో లెఫ్ట్, కాంగ్రెస్, భాజపా కూటముల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది.

## మోదీ పాలన నచ్చిందట! బీఆర్ఎస్‌లో చేరుతారట!

కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ఓటేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచింది. 2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినా.. కాంగ్రెస్‌లోనే కొనసాగా. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తా అని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరుతానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని..కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా స్నేహం ఉంది. గతంలోనూ ఆయన్ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం. కాంగ్రెస్‌తో అనుబంధం వల్ల జీవన్‌రెడ్డి గతంలో పార్టీ మారలేదు. ఇప్పుడు మరోసారి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాం. రెండ్రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారు. రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు. హామీలు అమలు చేయకుండా అనవసర మాటలు మాట్లాడుతున్నారు. ఇదిలావుంటే సీఎం రేవంత్ రెడ్డి భాషపై జనాల్లో చర్చ జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.

రేవంత్ కన్నా...కెసిఆర్ పాలనే బెటర్

రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి

## ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు నమ్మొద్దు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది.గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 – ఏప్రిల్ 22, 2016 – ఏప్రిల్ 22, 2017 – ఏప్రిల్ 16, 2018 – ఏప్రిల్ 13, 2019 –ఏప్రిల్ 18, 2020 – జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021–జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 – జూన్ 28, 2023 – మే 9, 2024 – ఏప్రిల్ 24, 2025 –ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. తప్పుడు వార్తలను నమ్మవద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

## అంగన్‌వాడీ టీచర్‌పై దాడి చేసిన ఐదుగురి అరెస్టు

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారిని ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి కొట్టారు గ్రామస్తులు. జుట్టు కత్తిరించి గాడిదాపై ఉరేగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. వద్దని ప్రాధేయపడ్డా కూడా కనికరించకుండా గ్రామస్తులు దారుణంగా వ్యవహరించారు. గంటకు పైగా అంగన్ వాడీ టీచర్ ను చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిపారు. దీనికి గల కారణం ఏంటంటే.. అంగన్ వాడీ టీచర్ భర్త ఇన్సూరెన్స్ డబ్బులను గ్రామస్థుల నుంచి వసూలు చేసి తిరిగి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. భర్తపై ఉన్న కోపంతో సంబంధం లేని మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు గ్రామస్తులు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

- పాఠశాల కాంపౌండ్ వాల్ కూల్చివేత దుర్మార్గం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపీ రఘునందన్ వినతి

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ ప్రజాసంక్షేమం కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా .. పాఠశాల తరగతి గదులను కూల్చివేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించి పాఠశాల గదులను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల కూల్చివేతలపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

## రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే వినోద్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ రైల్వే నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన పలు రైల్వే సమస్యలను జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైల్వే సదుపాయాల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచడం, స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా రైల్వే సేవలను విస్తరించడం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. ఎమ్మెల్యే తెలిపిన సమస్యలను జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సానుకూలంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రైల్వే సదుపాయాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

## అత్యాచారం కేసులో కార్పొరేటర్ భర్తకు పదేళ్ల జైలుశిక్ష

- వరంగల్ కోర్టు సంచలన తీర్పు

**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 09 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన అత్యాచారం కేసులో స్థానిక కార్పొరేటర్ భర్తకు న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. ఓ యువతిని మోసం చేసి అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో వరంగల్ ఎల్లంబజార్ కు చెందిన ప్రధాన నిందితుడు ఆకుతోట శిరీష్ కు పదేళ్ల జైలు శిక్షతో పాటు యాభై ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ వరంగల్ ఒకటో అదనపు సెషన్స్ న్యాయమూర్తి ప్రేమలత తీర్పు వెలువరించారు. ఇదే వ్యవహారంలో నిందితుడికి సహకరించిన అతని తండ్రి ఆకుతోట సుధాకర్ కు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఇదిలా ఉండగా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం. 353/2021 కేసులో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎస్సీ నం. 349/2022 కింద విచారణ జరిగిన ఈ కేసులో, ఐపిసి సెక్షన్లు 417, 420, 376, 406, 506 ప్రకారం నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఈ మేరకు, ప్రధాన నిందితుడు ఆకుతోట శిరీష్ (వయసు 32, వ్యాపారి, ఎల్లమ్మ బజార్, వరంగల్)కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 55,000 జరిమానా విధించారు. అదే కేసులో రెండో నిందితుడు ఆకుతోట సుధాకర్ (వయసు 58)కు రూ. 1,000 జరిమానా విధించారు. ఈ తీర్పును వరంగల్‌లోని 1వ అదనపు సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జి. ప్రేమలత వెలువరించారు. ఇదిలా ఉండగా ఈ తీర్పు సంచలనం అయ్యింది.

## గంజాయి సమాచారం ఇవ్వండి

### రూ. 5వేల వరకు బహుమతి పొందండి

- సమాచారం ఇవ్వాల్సిన మొబైల్ నెం.8712656999
- జిల్లా ఎస్పీ డా. శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 09(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత మరియు భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ శబరిష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్య అని, ఇది నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుందని మరియు వ్యక్తులను నేరాల వైపు నడిపిస్తుందన్నారు. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటి అని అన్నారు. గంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఉరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజాయి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు. అందువల్ల మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోందన్నారు. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి రూ. 5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుందనీ, సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు తమ సమాచారం ఈ ప్రత్యేక మొబైల్ నంబర్ 8712656999 ద్వారా అందించవచ్చన్నారు. మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పును తీసుకురాగలదు. మన యువతను కలిసి మహబూబాబాద్ జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా కాపాడుకుందాం మార్చుకుందామన్నారు.

# నగరంలో ట్రాఫిక్ చిక్కులకు లైన్‌క్లియర్!

### షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్

- బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు



**హైదరాబాద్, ఏప్రిల్9 (జనంసాక్షి) :** భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎన్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొంద్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ , కె. శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 11న అఖిల భారత కిసాన్ సభ 90వ వార్షికోత్సవం

### పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సాగర్, సారంపల్లి పిలుపు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెయస్) 90వ వార్షికోత్సవాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో విజయవంతం చేయాలని జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ కోరారు. గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ...ఏప్రిల్ 11న లక్నోలో స్వామి సహజానంద్ సరస్వతి నేతృత్వంలో ఏర్పాటైన భారతదేశ అతిపెద్ద రైతు సంఘం అని, ఇది బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, జమీందారీ వ్యవస్థ రద్దు, భూ సంస్కరణలు, రుణ విముక్తి రైతుల హక్కుల కోసం పోరాడిందని తెలిపారు. కార్పొరేట్ అనుకూల , రైతు వ్యతిరేక చట్టాలను ప్రతిఘటించిందని, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు అమెరికా, బ్రిటన్ సామ్రాజ్యవాదులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టేందుకు వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారని, ఈ రూపంలో మళ్లీ సామ్రాజ్యవాదులు భారతదేశంలోకి వ్యవసాయ రంగంలోకి చొరపడేందుకు అవకాశం ఇస్తున్నారని, మరోవైపు రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారు ఎఐకెయస్ ఆవిర్భావ స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాదానికి విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామ గ్రామాన జెండావిష్కరణలు చేసి ప్రతిజ్ఞలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్,రాష్ట్ర నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాంక్ బీపీఎల్ అవినీతి

### సమీప పోస్ట్ ఆఫీస్‌లో అవకతవకలు..

వేరువేరు ఖాతాల నుండి మూడు నుండి నాలుగు లక్షలు వరకు స్వాహా..!



**లక్ష్మణ చందా, ఏప్రిల్ 9, (జనం సాక్షి) :** లక్ష్మణ చాంద మండలం లో నీ పోస్టల్ బ్యాంకులో బిపిఎల్ గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ అనే ఉద్యోగి అవినీతికి పాల్పడ్డాడు ఈ అవినీతిని లక్ష్మణ్ చంద గ్రామానికి చెందిన తిరుమల రెడ్డి యొక్క మనమరా లు సుకన్య సమృద్ధి యోజన పథకం కు డబ్బులు ఒక్క లక్ష యాభై వేలు వేయమని ఇచ్చినాడు పదేపదే బుక్కు ఇవ్వమని అడగగా ఆ విషయాన్ని దాటా వేశారు ఆయనకు సందేహం వచ్చి మా యొక్క బ్యాంకు ఖాతా బుక్కును మాకు ఇవ్వండి అనగా ఇవ్వలేదు సందేహం వచ్చినా ఆయన బ్యాంకుకు తీసుకొని వచ్చి అడగగా ఆ డబ్బులను నేను నా అవసరాలకు వాడుకున్నాను అని చెప్పాడు తర్వాత ఈ విషయాన్ని గ్రామస్తుల కు తెలియజేయగా ఒక్కొక్కరుగా బయటికి వచ్చి అడగగా వారి డబ్బులు కూడా వాడుకున్నట్లు తెలియజేశాడు ఇందులో పింఛన్దారులు కూడా ఉన్నారు లక్ష్మణ్ చందా బాధితులు నిర్మల్ బ్రాంచ్ కు తీసుకువెళ్లారు తర్వాత పోస్టల్ బ్యాంకు ఇన్స్పెక్టర్ పోస్టల్ సబ్ డివిజనల్ జి సందీప్ పంచనామా చేయగా సుమారుగా మూడు లక్షలు నుండి 4 లక్షల వరకు అవినీతి జరిగినట్టు తెలిపారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారులు తెలిపారు.

## నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

- మాటువేసి దుండుగుడి పట్టివేత



**నల్లగొండ, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా డాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

- శాంతియుత నిరసనలతో ఖండించాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**చిత్తూరు, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చున్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగ్రలాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతో పాటు ఆటలకు ఇవ్వాలని సూచిం చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## నామినల్ మస్టర్ రోల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ లో, గురువారం, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దిన సరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024 - 25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 - 26 సంవత్సరానికి 10 శాతం, 2026 - 27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలిపారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం మొక్కలు ధ్వంసం

- డంపింగ్ యార్డు సమీపంలో 200 మొక్కలు ధ్వంసం



**పెద్దవంగర, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** హరితహారం లో నాటిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం డోజర్ సహాయంతో దాదాపు 200 మొక్కలను ధ్వంసం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఎఫ్ ఏ మహేష్ తెలిపారు. పెద్దవంగర మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద గత సంవత్సరం హరితహారం లో నాటిన మొక్కలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతోపాటు వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## దృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక పాఠశాల

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో దృష్టి లోపం గల విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల వినతులు, ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక -ప్రజా పాలన లో భాగంగా ముందుకు వచ్చారు. ఖమ్మం నగర నడిబొడ్డున గల నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రత్యేక అవసరాలున్న, దృష్టిలోపం విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలగా సర్వాంగ సుందరంగా, అత్యాధునిక వసతులతో ప్రత్యేక పాఠశాలగా తీర్చి దిద్ది, అందుబాటులోనికి తీసుకొనిరావడం జరిగినది. అంధ విద్యార్థులు సమాజంలో సమాన అవకాశాలు పొందాలి, వైకల్యం వారి చదువుకు అడ్డంకి కాకూడదు, అనే లక్ష్యంతో ఈ పాఠశాల స్థాపించబడిందని పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 ఏప్రిల్ 2026

# “క్వీన్ ఆఫ్ క్రైమ్”: అగాథా క్రిస్టీ

## సృజనాత్మకత, సమకాలీన ప్రసక్తి

ప్రపంచ సాహిత్య చరిత్రలో 'నేర కథా రచయిత్రి'గా అగాథా క్రిస్టీ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది. బైబిల్, షేక్స్పియర్ తర్వాత అత్యధికంగా అమ్ముడైన పుస్తకాలలో ఆమె రచనలు ఉన్నాయి. అనే రికార్డు ఆమె స్వంతం చేసుకున్నారు. అగాథా క్రిస్టీ 66 నవలలు, 14 కథా సంకలనాలు, రాశారు . ప్రపంచంలోనే అత్యంత దీర్ఘకాలం ప్రదర్శితమవుతున్న 'ది మౌస్ట్రాప్' నాటకం ఇవన్నీ ఆమె అపార ప్రతిభకు నిదర్శనాలు. అయితే, ఈ వ్యాసం క్రిస్టీని కేవలం 'క్రైమ్ క్వీన్'గా కాక, తన కాలంలోని సామాజిక, సాంస్కృతిక ప్రక్రియలతో సంభాషించిన ఒక సంక్లిష్ట రచయిత్రిగా పేరు సంపాదించింది. ఈ సమీక్ష ఆమె జీవితంలోని కీలక ఘట్టాలను, రచనా ప్రత్యేకతలను, సాహిత్య విమర్శకుల దృక్పథాలను అలాగే నేటి సందర్భంలో ఆమె ప్రసక్తిని సమగ్రంగా అర్థం చేసుకోవడం మన విధి.

**జీవితంలోని అద్దం: రచనలోకి ప్రతిబింబించిన వాస్తవాలు**

అగాథా క్రిస్టీ తన వ్యక్తిగత జీవితంలోని అనేక సంఘటనలు ఆమె రచనలను ప్రత్యక్షంగా ప్రభావితం చేశాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫార్మసిస్ట్ గా పనిచేసిన అనుభవం ఆమెకు విషాలపై అద్వితీయ పరిజ్ఞానాన్ని ఇచ్చింది. ఆమె నవలల్లో విషప్రయోగాలు చాలా వాస్తవికంగా, శాస్త్రీయంగా చిత్రీకరించబడటానికి ఇదే ప్రధాన కారణం. రెండవ వివాహం తర్వాత పురావస్తు శాస్త్రవేత్త మ్యాక్స్ మల్లోవాన్‌తో కలిసి మధ్యప్రాచ్యంలో గడిపిన రోజులు 'మర్డర్ ఇన్ మెసొపొటేమియా', 'డెత్ ఆన్ ది నైల్' వంటి నవలలకు నేపథ్యంగా నిలిచాయి.

అయితే, ఆమె జీవితంలో అత్యంత రహస్యమైన, చర్చనీయాంశమైన ఘట్టం 1926లో జరిగిన రహస్య అదృశ్యం.ఆమె తల్లి మరణం, భర్త వ్యభిచారం వల్ల కలిగిన మానసిక క్షోభతో దాదాపు పదకొండు రోజుల పాటు ఎవరికీ కనిపించకుండా పోయింది. చివరకు ఆమె ఒక హోటల్లో ఆమె భర్త ప్రేయసి పేరుతో (మారు పేరు తో) రిజిస్టర్ అయినట్లు గుర్తించబడింది. ఈ ఘటన ఆమె జీవితంలోనే ఒక నేర కథలా మారింది. ఒక సైకాలజీ విమర్శకుడు 'టీసన్ ఫుగ్' ఈ అనుభవాన్ని ఆమె రచనల్లోని 'గుర్తింపు సంక్షోభం' అలాగే 'ద్వంద్వ జీవితాల' నేపథ్యాలకు సంబంధించిన విషయాలు పేర్కొన్నారు.

**సృజనాత్మక వైచిత్రి: సూత్రంలోని సూక్ష్మ విప్లవం:**

క్రిస్టీ రచనలు సాధారణంగా 'విషాదాంత సుఖాంతం' (ట్రాజిక్ కంఫర్ట్ )గా సాహిత్య విమర్శకులు వర్ణిస్తారు, ఉదాహరణకు 'గోల్డెన్ ఏజ్' నేర కథలకు ప్రతీకగా వారు భావించారు. ఒక స్థిరమైన సామాజిక వ్యవస్థలో జరిగిన హత్య, చివరికి అసాధారణ మేధస్సు గల డిటెక్టివ్ చేత పరిష్కరించబడి, సమాజంలోని క్రమం తిరిగి నెలకొల్పబడుతుంది.

కానీ ఇరవై ఒకటవ శతాబ్దపు విమర్శనాత్మక దృష్టితో చూస్తే, ఈ అభిప్రాయం ఆమె సృజనాత్మక ప్రయోగాలను అతి సూక్ష్మీకరిస్తుంది ని తెలుస్తుంది. జెస్సర్ గుల్లాల్ వంటి పండితులు ఆమె నవలలు సౌకర్యవంతమైన సంప్రదాయబద్ధతకు వ్యతిరేకంగా పనిచేస్తాయని వాదిస్తారు. ఆమె నవలల్లో హంతకుడు సమాజం నుండి వెలిగించబడే ఒక వ్యక్తిగత వికృతం కాదు. బదులుగా, ఆమె నిర్మించే ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సంభావ్య హంతకులే. ఈ దృక్పథం ఆమె కథలను కేవలం పజిల్స్ గా కాక, మానవ స్వభావంపై ఒక చీకటి వ్యాఖ్యానంగా ఉంటుందని తెలిపారు.

ఆమె సృజనాత్మకతకు మరొక ప్రత్యేకత 'మెటాఫిక్షన్' (తనను తాను ప్రశ్నించుకునే కల్పన). దాదాపు అన్ని నవలల్లో, డిటెక్టివ్ సాక్ష్యాలను అన్వేషిస్తున్నట్లు చూపినా, నిజానికి కథనానికుడిగా ఉండే కథకుడు నిజానికి అత్యంత సమ్మదగిన వ్యక్తిగా మారడం ('ది మర్డర్ ఆఫ్ రోజర్ అక్రాయిడ్' లో వలె) ఆమె ప్రతిభను చాటుతుంది. ఇటువంటి కథన ప్రయోగాలు సమకాలీన ఉత్తర-ఆధునిక రచనలను తలపిస్తాయి.

**సమకాలీన సందర్భంలో వ్యాఖ్యానం:**

నేటి సమాజంలో క్రిస్టీ రచనలకు ఎందుకు ఇంత ప్రసక్తి కలిగి ఉన్నాయి? దీనికి మూలకారణం ఆమె చిత్రీకరించిన సమాజంలోని అసమానతలు, వర్గ విభేదాలు, లింగ వివక్ష ఇప్పటికీ కొనసాగుతూనే ఉండడమే. వార్విక్ విశ్వవిద్యాలయ పరిశోధకురాలు అగాథా క్రిస్టీ నవలలను 'గోతిక్ సంప్రదాయం'తో ముడిపెడుతూ, ఆమె రచనలు 'గృహం' (డొమెస్టిక్) అనే భావనను ఎలా సంక్లిష్టంగా మారుస్తాయో వివరిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిష్ సమాజంలో 'ఇల్లు' అనేది ఇక ఏమాత్రం సురక్షితమైన కేంద్రం కాదు. అదే నేరానికి, అశాంతికి కేంద్ర బిందువు అవుతుంది. 'ఎ మర్డర్ ఈజ్ అనౌన్స్డ్' లో చిన్నపాటి గ్రామం మధ్యలో హత్య ప్రకటన ప్రచురించబడడం ఈ భావనకు అద్దం పడుతుంది.

'ది పేల్ హార్స్' వంటి నవలల్లో ఆధునిక టెక్నాలజీ (విద్యుత్ యంత్రాలు, సైన్స్ ఫిక్షన్ అంశాలు) నేరానికి ఉపకరణాలుగా మారడం చూస్తాం. ఇది నేటి సైబర్ నేరాలు, టెక్నాలజీ దుర్వినియోగంపై చేసే వ్యాఖ్యానాన్ని సమకాలీన విషయాల ప్రస్తావనగా మారుస్తుంది.

**వారసత్వం: సవాళ్లు, స్వీకరణ:**

అగాథా క్రిస్టీకి విమర్శకుల నుండి ఎదురైన ప్రధాన సవాల్ ఆమె పాత్ర చిత్రీకరణకు సంబంధించింది. ఎడ్మండ్ విల్సన్, పి.డి. జేమ్స్ వంటి రచయితలు ఆమె పాత్రలను 'గట్టి కార్డ్‌బోర్డ్'తో చేసినట్లు, ఉపరితలంగా ఉంటాయని విమర్శించారు. అయినప్పటికీ, ఆమె ప్లాట్లు నిర్మాణంలోని అద్భుతమైన కౌశలం ఈ విమర్శలను ఎప్పటికప్పుడు అధిగమిస్తూనే ఉంటుంది.

సినిమా, టెలివిజన్ అనుసరణలు ఆమె వారసత్వాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాయి. కెన్నెత్ బ్రానా నిర్మించిన ఆధునిక 'మర్డర్ ఆన్ ది ఓరియంట్ ఎక్స్‌ప్రెస్' (2017), 'డెత్ ఆన్ ది నైల్' (2022) సినిమాలు ఆమె కథలను కొత్త తరానికి పరిచయం చేశాయి. అయినప్పటికీ, ఈ అనుసరణలు కొన్నిసార్లు ఆమె అసలు రచనల్లోని సూక్ష్మ విమర్శలను, నేపథ్యాలను విస్మరించి, కేవలం దృశ్య వైభవానికే ప్రాధాన్యత ఇస్తాయని విమర్శ కూడా ఉంది.

అగాథా క్రిస్టీ కేవలం ఒక నేర కథా రచయిత్రి మాత్రమే కాదు;



ఇరవయ్యవ శతాబ్ది మధ్యలో మారుతున్న పాశ్చాత్య సమాజం యొక్క మానసిక స్థితిని, భయాలను, ఆశలను అత్యంత చాకచక్యంగా రికార్డ్ చేసిన ఒక చరిత్రకారిణి. ఆమె రచనలు 'గోల్డెన్ ఏజ్' నేర కథలకు నమూనాగా ఉంటూనే, వాటి స్వంత సంప్రదాయాలను తారుమారు చేస్తూ, “పోస్ట్ మాడర్న్” సాహిత్యం యొక్క అంచనాలను ఊహించాయి. నేటికీ ఆమె పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా బుక్స్ ఎగ్జిబిషన్ లలో, కొత్త అనువాదాలతో, కొత్త అనుసరణలతో ఆన్ లైన్ లలో కూడా విక్రయించబడటం, ఆమె కథలు, ఆ కథనాల్లోని మూలాధారమైన మానవ స్వభావం ఎంత సార్వత్రికమో చాటిచెప్పడానికి ఒక ఉదాహరణగా సరిపోతుంది. అగాథా క్రిస్టీ రచనలు ఇప్పటికీ ప్రపంచ డిటెక్టివ్ సాహిత్య అభిమానుల్ని , ఆకర్షిస్తోంది. ఆమె తర్వాత ఎందరో నేర పరిశోధనలో కథలు రాసేవారు ఎంతో మంది వచ్చారు. కానీ ఆమె రచనలు చదివే వారిని ఇప్పటికీ ముగ్ధులను చేస్తూనే ఉన్నారు, ఎందుకంటే నేరం ముగిసిన తర్వాత, శాంతి పునరుద్ధరించబడినా, ఆ శాంతి ఎంత నాజూకో, ఎంత అనిశ్చితమో ఆమె మనకు గుర్తు చేస్తూనే ఉంటారు. మన తెలుగు సాహిత్యంలో కూడా కొమ్మూరి సాంబశివరావు, మల్లాది వెంకట కృష్ణమూర్తి, మధుబాబు, విశ్వ మోహన్, టెంపోరావ్, బీనాదేవి మొదలైన రచయితలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. డిటెక్టివ్ సాహిత్యాన్ని ఒక తరం వారిని (1950–1990 ) వరకు ఉర్రూతలూగించారు. ఇప్పటికీ వారి రచనలకు పాఠకుల్లో క్రేజ్ తగ్గలేదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# రాళ్లలో దాగిన శాస్త్రం, సాంకేతిక ప్రతిభ!



## వేయి స్తంభాల గుడి శిల్పం అలంకరణ

హనుమకొండలోని వేయి స్తంభాల గుడి (శ్రీ రుద్రేశ్వర స్వామి ఆలయం) కేవలం ఒక దేవాలయం కాదు. అది ప్రాచీన భారతీయ సివిల్ ఇంజనీరింగ్, శిల్పకళ మరియు ఆధ్యాత్మికతల సమ్మేళనం. 1163 సంవత్సరంలో కాకతీయ రాజు రుద్రదేవుడు ఆధ్వర్యంలో నిర్మించబడిన ఈ మహా కట్టడం, 863 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ తన వైభవాన్ని కాపాడుకుంటూ నిలిచి ఉంది. ఇది కాకతీయుల శైలి, చాళుక్య ప్రభావాలతో కూడిన వేసర శైలిని ప్రతిబింబిస్తుంది. త్రికూటాలయ రూపంలో (మూడు గర్భగృహాలు) నిర్మితమైన ఈ గుడి శివుడు, విష్ణువు, సూర్యుడు అనే మూడు దేవతలకు అంకితం చేయబడింది. ఇది కాకతీయుల మత సామరస్యానికి, సాంస్కృతిక వైవిధ్యానికి సాక్ష్యం.

“వేయి స్తంభాల గుడి” అనే పేరు వచ్చినప్పటికీ, ఖచ్చితంగా వేయి స్తంభాలు లేవు. అయితే విస్తృతంగా వ్యాపించిన సుందరంగా చెక్కబడిన స్తంభాలు ఒక్కటి మరొకటి అడ్డుపడకుండా, ఏ మూలా నుంచైనా ప్రధాన దేవతను దర్శించేలా రూపొందించబడ్డాయి. ప్రతి స్తంభం ఒక స్వతంత్ర కళాఖండం. నల్లరాయి (డోలరైట్), ఇసుకరాయి వంటి పదార్థాలతో నిర్మించిన ఈ స్తంభాలపై నృత్యకారులు, యోధులు, జంతువులు, పురాణ కథలు సూక్ష్మంగా చెక్కబడి ఉంటాయి. ఒక్క స్తంభంపైనే వందలాది శిల్పాలు! ఇవి కేవలం అలంకరణ కాకుండా, నిర్మాణానికి బలాన్ని అందించే ఇంజనీరింగ్ భాగాలు కూడా.

ఈ గుడి నిర్మాణంలో అత్యంత ఆకర్షణీయమైన అంశం ఇంటర్‌లాకింగ్ సిస్టమ్. సిమెంట్ లేని ఆ కాలంలో రాళ్లను ఖచ్చితమైన కొలతలతో కట్ చేసి, ఒకదానితో ఒకటి తాళం వేసినట్లు అమర్చారు. బరువు మరియు ఘర్షణ ద్వారా స్థిరత్వం సాధించారు. ఇలాంటి డ్రై-స్టోన్ కన్‌స్ట్రక్షన్ ఆధునిక ఇంజనీరింగ్‌కు కూడా సవాలు విసిరే స్థాయిలో ఉంది. స్తంభాలు, గోడలు, పైకప్పు అన్నీ ఈ విధానంతో అమర్చబడటం వల్ల గుడి భూకంపాలు, సమయం యొక్క దాడులను తట్టుకుంది.

మరింత అద్భుతం ఏమిటంటే సాండ్ బాక్స్ టెక్నాలజీ (ఝఅఎఏశీఇ ఖీశీబఅష్ఁఅశీఅ). పునాది తవ్వి, దానిని ఇసుక, గ్రానైట్ పొడి, నిమ్మరసం, జాగరీ, మరికొన్ని సహజ పదార్థాల మిశ్రమంతో నింపారు. ఇది ఒక సహజ షాక్ అబ్జార్బర్ లాగా పని చేసి, భూకంప తరంగాలను గ్రహించి, నిర్మాణానికి దెబ్బ తగలకుండా చేస్తుంది. కాకతీయులు ఈ సాంకేతికతను రామప్ప ఆలయంలో కూడా వాడారు. ఆధునిక ఇంజనీరింగ్‌లో ఇలాంటి ఫౌండేషన్ టెక్నిక్స్ ఇప్పుడు పరిశోధన స్థాయిలో ఉపయోగిస్తున్నారు. 12వ శతాబ్దంలోనే భూకంప నిరోధక నిర్మాణ సూత్రాలను అవలంబించడం కాకతీయుల ముందుచూపును తెలియజేస్తుంది.

త్రికూటాలయ నిర్మాణం లోడ్ డిస్ట్రిబ్యూషన్‌కు అద్భుత ఉదాహరణ. మూడు గర్భగృహాలు సమతుల్యంగా అమర్చడం వల్ల బరువు సమానంగా పంపిణీ అవుతుంది. స్టార్ ఆకృతి ప్లాట్‌ఫాం, సూక్ష్మ శిల్పాలు, పెర్ఫొరేటెడ్ స్క్రీన్లు, ఒకే రాతితో చెక్కిన అద్భుతమైన నంది విగ్రహం – ఇవన్నీ కాకతీయ శిల్పుల నైపుణ్యానికి సాక్ష్యం. నంది విగ్రహం ఉపరితలం దర్పణంలా మెరిసేలా పాలిష్ చేయబడింది. ఇది డోలరైట్ రాయి వంటి కఠిన పదార్థంపై సాధించిన అపూర్వ విజయం.

కాకతీయులు శైవ భక్తులు అయినప్పటికీ, ఈ గుడిలో వైష్ణవ, సౌర సంప్రదాయాలను కూడా చోటు ఇవ్వడం వారి సామరస్య దృక్పథాన్ని చూపిస్తుంది. ఆలయం కేవలం పూజా స్థలం కాకుండా, నాట్యం, సంగీతం, విద్యా కేంద్రంగా కూడా పని చేసేది. ఆ కాలపు సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని ఈ శిల్పాలు ఇప్పటికీ చెబుతున్నాయి.

చరిత్రలో ఈ గుడి అనేక సవాళ్లను ఎదుర్కొంది. 1309లో మాలిక్ కాఫూర్ దండయాత్ర, 1323లో కాకతీయ సామ్రాజ్య పతనం సమయంలో కొన్ని భాగాలు ధ్వంసమయ్యాయి. అయినప్పటికీ ప్రధాన నిర్మాణం నిలిచి ఉండటం దాని ఇంజనీరింగ్ బలానికి నిదర్శనం. బ్రిటిష్ కాలం నుంచి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంరక్షణ చేపట్టింది. 2004 తర్వాత పెద్ద స్థాయి పునరుద్ధరణ జరిగింది. ప్రస్తుతం ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం మరియు ప్రధాన పర్యాటక కేంద్రం.

వేయి స్తంభాల గుడి మనకు ఏం నేర్పుతుంది?

ఇది సాంకేతికత, కళ, ఆధ్యాత్మికతల సమన్వయం ఎంత శక్తివంతమో చూపిస్తుంది. ప్రకృతి పదార్థాలతోనే దీర్ఘకాలిక, భూకంప నిరోధక నిర్మాణాలు సాధ్యమని నిరూపిస్తుంది. ఆధునిక ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు ఇంకా ఈ గుడిని అధ్యయనం చేస్తున్నారు. సస్టైనబుల్ కన్‌స్ట్రక్షన్, ఎర్త్‌క్వేక్ రెసిస్టెంట్ టెక్నాలజీలకు ఇది ఒక లైవ్ లెసన్. ఈ గుడి మన చరిత్రను, మన పూర్వీకుల ప్రతిభను గుర్తు చేస్తుంది. కాకతీయుల కాలం దక్షిణ భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక సమృద్ధి, కళా వికాసం యొక్క స్వర్ణయుగం. వారు రాళ్లను కేవలం కట్టడాల కోసం కాకుండా, జీవంతో నింపారు. ప్రతి శిల్పం ఒక కథ చెబుతుంది, ప్రతి స్తంభం ఒక పాఠం నేర్పుతుంది.

నేటి యువతరం ఈ వారసత్వాన్ని అర్థం చేసుకోవాలి. చరిత్రను కేవలం పుస్తకాల్లో చదవకుండా, ఇలాంటి స్మారకాలను సందర్శించి, అధ్యయనం చేయాలి. సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు – ప్రతి పౌరుడి కర్తవ్యం. వేయి స్తంభాల గుడి వంటి నిర్మాణాలు మన సంస్కృతికి మూలస్తంభాలు. వీటిని కాపాడటం అంటే మన గతాన్ని గౌరవించడం, భవిష్యత్తును బలపరచడం.

1163లో నిర్మించబడి 2026 నాటికి 863 సంవత్సరాల చరిత్రను మోస్తున్న ఈ అద్భుత గుడి, కాలం మారినా తన మహిమ చెదరని శాశ్వత సాక్ష్యం. ఇది మనకు చెబుతుంది – సాంకేతికత మరియు కళ సమన్వయం అయినప్పుడు మాత్రమే ఒక నాగరికత శాశ్వతంగా నిలుస్తుంది. వేయి స్తంభాల గుడి కేవలం రాళ్ల కట్టడం కాదు; అది భారతీయ మేధావికి, సృజనాత్మకతకు, ఇంజనీరింగ్ ప్రతిభకు జీవంత సాక్ష్యం. డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి వంటి చరిత్ర పరిశోధకులు ఇలాంటి వారసత్వాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా మనకు కొత్త దృక్పథాలు అందిస్తున్నారు. ఈ గుడిని సంరక్షించడం, ప్రచారం చేయడం – ఇది మన అందరి బాధ్యత. తెలంగాణ గర్వం, భారతదేశ వారసత్వం – వేయి స్తంభాల గుడి ఎప్పటికీ అలాగే వెలుగొందాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# క్యూబా మీద ట్రంప్ ఒత్తిడి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది జనవరి 29న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసి క్యూబా పై నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. క్యూబా ప్రభుత్వం రష్యా, చైనా, ఇరాన్, హమాస్, హెజ్బొల్లా వంటి అమెరికా వ్యతిరేక శక్తులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, వారికి సైనిక-ఇంటెలిజెన్స్ సౌకర్యాలు అందించడం యునైటెడ్ స్టేట్స్ జాతీయ భద్రతకు తీవ్ర బెదిరింపు అని వాదించారు.

ఈ ఆర్డర్ యొక్క ప్రధాన ఆయుధం – చమురు నిరోధం. వెనిజులా నుంచి క్యూబాకు వచ్చే చమురు సరఫరాను పూర్తిగా అడ్డుకున్నారు. మెక్సికో, రష్యా వంటి ఇతర దేశాలు క్యూబాకు చమురు అమ్మితే వాటి ఉత్పత్తులపై అమెరికా మార్కెట్‌లో భారీ టారీఫ్స్ విధిస్తామని హెచ్చరించారు. ఫలితంగా క్యూబాలో తీవ్రమైన ఇంధన కొరత ఏర్పడింది. దేశవ్యాప్తంగా పవర్ బ్లాకౌట్లు సాధారణమయ్యాయి. ఆసుపత్రులు, పాఠశాలలు మూసివేతలు ఎదుర్కొంటున్నాయి. ఆర్థిక సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతోంది.

ట్రంప్ పదేపదే “క్యూబా ఈజ్ నెక్స్ట్” అంటూ, “నేను క్యూబాను ఫ్రీ చేస్తాను”, “ఫ్రెండ్లీ టేకోవర్” కావచ్చు అని ప్రకటిస్తున్నారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోను తొలగించిన తర్వాత క్యూబా తదుపరి లక్ష్యం అని స్పష్టం చేశారు. లక్ష్యం స్పష్టం – ఆర్థికంగా క్యూబా పాలనను బలహీనపరచి, కమ్యూనిస్టు వ్యవస్థను కూల్చివేయడం లేదా అనుకూల రాజకీయ మార్పు తీసుకురావడం. లాటిన్ అమెరికాలో అమెరికా ప్రభావాన్ని మరింత పెంచుకోవడం, అమెరికన్ బిజినెస్‌లకు కొత్త అవకాశాలు తెరవడం కూడా ఈ




వ్యూహంలో భాగం.

1960 నుంచి ఉన్న అమెరికా ఎంబార్గోను ఈ చర్యలు మరింత తీవ్రం చేశాయి. ప్రస్తుతం క్యూబా ప్రభుత్వంతో దౌత్య చర్చలు జరుగుతున్నప్పటికీ, రాజకీయ మార్పు (ముఖ్యంగా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్-కేనెల్ రాజీనామా) అంశంపై ఒత్తిడి కొనసాగుతోంది. క్యూబా సైన్యం తన సన్నాహాలు పెంచుకుంటోంది. పరిస్థితి ఇంకా ఎలా మారుతుందో చూడాలి.

ఈ ఒత్తిడి వల్ల అత్యధికంగా నష్టపోతున్నవారు క్యూబా సామాన్య ప్రజలు. విద్యుత్ కట్‌లు, ఆహార కొరత, వైద్య సేవల అంతరాయం – ఇవన్నీ వారి రోజువారీ జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. ట్రంప్ పాలసీ “క్యూబా ప్రజలను మద్దతు చేస్తాము, కానీ రెజిమ్‌ను బలహీనపరుస్తాము” అని చెబుతోంది. కానీ వాస్తవంలో ఆర్థిక యుద్ధం సామాన్యులపైనే ఎక్కువ ప్రభావం చూపుతోంది.

అంతర్జాతీయంగా ఈ చర్యలు వివాదాస్పదం అయ్యాయి. కొందరు దీనిని అమెరికా ఏకపక్ష విధానం, ఆర్థిక దాడి అంటున్నారు. మరికొందరు క్యూబా కమ్యూనిస్టు పాలన దశాబ్దాలుగా మానవ హక్కుల ఉల్లంఘనలు, దమనకాండ కొనసాగిస్తోందని, అందుకు ఒత్తిడి అవసరమని వాదిస్తున్నారు.

క్యూబా మీద ట్రంప్ ఒత్తిడి కేవలం ఒక దేశంపైని చర్య కాదు. ఇది లాటిన్ అమెరికాలో అమెరికా ప్రభావం పునరుద్ధరణ, కమ్యూనిస్టు వ్యవస్థలను ఆర్థికంగా కుదిపేసి రాజకీయ మార్పు తీసుకురావడం అనే వ్యూహాత్మక ప్రయత్నం. వెనిజులా తర్వాత క్యూబా “నెక్స్ట్” అని ట్రంప్ చెప్పడం ఆయన ఉద్దేశాలను స్పష్టం చేస్తోంది.

కానీ ఈ ఆర్థిక యుద్ధం ఎంతకాలం కొనసాగుతుంది? క్యూబా ప్రజలు ఎంతకాలం బాధపడతారు? చర్చల ద్వారా రాజకీయ మార్పు సాధ్యమవుతుందా లేదా మరిన్ని సంక్షోభాలు రాబోతున్నాయా? ప్రస్తుత పరిస్థితి లాటిన్ అమెరికా రాజకీయాల్లో కొత్త అధ్యాయం తెరుస్తోంది. ఫలితం ఏమైనా, క్యూబా సామాన్యుల బాధలు తగ్గాలని, దీర్ఘకాలిక స్థిరత్వం వస్తుందని ఆశిద్దాం.



మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
సెల్ ; 98850 45344

# అంతరంగ ఆవిష్కరణ “సంకెళ్లను తెంచుకుంటూ”

ప్రజాస్వామ్య వ్యవస్థను పరిపుష్టం చేయడంలో శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థ లతో పాటు పత్రికారంగం కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో దేని ప్రాధాన్యం దానిదే అయినా శాసన వ్యవస్థ ద్వారా నిర్దేశింప బడిన కార్యక్రమాలను అమలు చేయడంలో, ఆయా రంగాలలో సృజనాత్మ కంగా పనిచేసిన కొంతమంది అధికారులు ప్రజల మదిలో ఎప్పటికీ మెదులుతూనే ఉంటారు. అలాంటి విశిష్ట వ్యక్తులలో ఐ.ఏ.ఎస్ అధికారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాధ్యతలు నిర్వర్తించిన కాకి మాధవరావు గారు ముఖ్యులు. కృష్ణాజిల్లా పెదమద్దాలి గ్రామంలో 1939లో ఒక దళిత పేద కుటుంబంలో జన్మించిన మాధవరావు పాలేరు నాటకంలో వెంకన్నలా అష్ట కష్టాలు పడి ఉన్నత చదువులు చదువుకొని 1962లో ఐ.ఏ.ఎస్ ఉత్తీర్ణత సాధించారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ శాఖలలో పనిచేసి చివరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు గారు కాస్త ఆలస్యంగా నైనా జనవరి 2023 లో"సంకెళ్లను తెంచుకుంటూ.." ఓ దళిత చీఫ్ సెక్రటరీ ఆత్మకథ ను రాశారు. 289 పుటలలో 14 అధ్యాయాలుగా వివరింపబడిన వారి ఆత్మకథ ఇటు విద్యార్థులకు అటు ఉద్యోగులకు, యువతకు ముఖ్యంగా సామాజిక పరిశీలకులకు అధ్యయనశీలురకు చక్కని పరిశోధన గ్రంథం, పరామర్శ గ్రంథం అని చెప్పవచ్చు. “×త్వశ్రీశ్రీఅస్త్రవత్ జూవశీజూశ్రీవ ఎశీత్ ఎశీ ఎఱటటవతీవత్ ష్త్రఱఅస్త్రం,్ష్త్రవఎ ఎశీ ష్త్రఱఅస్త్రం ఎఱటటవతీవత్శ్రీఎ” అనే దానికి ఈ గ్రంథంలోని ప్రతి పుట సాక్ష్యం ఇస్తుంది. గంభీరమైన విషయాలను కూడా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా వివరించడం కోసం తన బాల్యం నుంచి పదవీ విరమణ అనంతర జీవితం వరకు అన్ని అంశాలను కూలంకషంగా వివరించారు.

ఇందులోని ప్రతి అధ్యాయం పాఠకులకు ఆలోచనతో పాటు అనుభూతిని, అనుభవాలను పంచుతుంది. మొదటి అధ్యాయంలో తండ్రి తనలాగే తన కొడుకులు నమ్మకస్తులైన పాలేర్లుగా జీవితం గడపాలని ఆశించినా, తల్లి మాణిక్యమ్మ వాళ్ళిద్దరినీ ఆయనకు తెలియకుండా బడికి పంపించడంతో వారి జీవితాలలో “అక్షర కిరణాలు” ఉదయించాయి అన్నారు. ముఖ్యంగా ఈ సందర్భంలో ఆయన చెప్పిన “పని వాళ్లు ఎక్కువైతే జీతాలు తగ్గుతాయి. వారి సంఖ్య తగ్గితే జీతాలు పెరుగుతాయి... కూలీల పిల్లలు చదువుకుంటే ఆత్మ గౌరవం పెరుగుతుంది. తమ హక్కుల గురించిన చైతన్యం వస్తుందని తమ దోపిడీని ప్రశ్నిస్తారని అందుకే చదువుకున్న యువత సోమరిపోతులై తిరుగుతారని, వారిని పాలేర్లుగా, కూలీలుగా పనిలో పెట్టాలని భూస్వాములు పేద ప్రజలకు నూరిపోస్తారు"అన్న మాటలు అక్షర వాస్తవాలు. భూమి గుండ్రంగా ఉందన్నట్లు ప్రాంతాలతో పని లేకుండా అన్నిచోట్ల అదే పరిస్థితి ఆనాడు నెలకొన్న మాట వాస్తవం. అందుకే ఇక్కడ దొరలు అక్షరం మొలకెత్తకుండా జాగ్రత్తపడ్డారు. ఇది రచయిత సామాజిక స్పృహకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. బహుశా బందరులో తను చదువుకుంటున్న రోజుల్లో “కప్ మీల్స్” విషయం గుర్తుకొచ్చి ఆయన వరంగల్లో కలెక్టర్ గా ఉన్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు ఫుల్ మీల్స్ పెట్టడానికి స్ఫూర్తినిచ్చిందనుకుంటాను. జమాబంధీ సందర్భంలో అనువంశికంగా గ్రామాధికారులైన వారు కొందరు అవకతవకలకు పాల్పడుతున్న విషయాన్ని గమనించిన మాధవరావు గారు తన పై అధికారికి ఫిర్యాదు చేయగా ఆయన “మనం అధికారుల మే కానీ సంఘసంస్కర్తలము కాదనడం” బ్యూరోక్రసి లోని ఒక వర్గ స్వభావాన్ని తెలియపరుస్తుంది. అయితే దానికి స్పందనగా"నేను ఆ గీతాచార్యునికి అర్జునుడినీ కాదల్చుకోలేదు"అని స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఆయన నిలువెత్తు వ్యక్తిత్వానికి నిదర్శనం.1971లో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మాధవరావు గారు అవినీతి అక్రమాలకు తావు లేకుండా జిల్లాలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా పేదలకు భూ పంపిణీ వ్యవహారంలో ఉమ్మడి సహకార వ్యవసాయ సంఘాలను ఏర్పాటు చేసి వారు వ్యక్తిగతంగా ఆ భూముల్ని అమ్ముకోకుండా, పైగా కరువు నిధులను వినియోగించి ఆ భూములను సేద్యానికి యోగ్యంగా మారేలా చేయటంలో భాగంగా అక్కడే బావులను తవ్వించారు. ప్రభుత్వ నిధులను తాత్కాలిక మరమ్మత్తులకు కాకుండా శాశ్వత పనులకు వినియోగించడం అదొక వినూత్న ప్రయత్నం గా చెప్పవచ్చు. జాతీయస్థాయిలో ఈనాడు అమలవుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా దశలవారీగా ఇదే కోణంలో కొనసాగిస్తే, వాటికి కేటాయించిన నిధులు సద్వినియోగం




అవుతాయి అనుకుంటాను. వారి కృషి అందుకు ప్రేరణగా నిలుస్తుంది.

ఆనాడు వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాల్లో కాకలు తీరిన యోధునిగా గుర్తింపు పొందిన హయగ్రీవాచారి హన్మకొండ బస్టాండ్ సమీపంలోని బాలసముద్రంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకొని దాని చుట్టూ ఎత్తయిన ప్రహరీని నిర్మించాడు. అయితే జిల్లా కలెక్టర్ గా ఉన్న మాధవరావు గారు అదే మంత్రికి నోటీసులు జారీ చేయడం ఆనాడు సంచలనం సృష్టించింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఆ భూమి తిరిగి ప్రభుత్వం ఆధీనంలోకి చేరింది. అందుకు ప్రాథమికంగా బాటలు పరిచింది మాధవరావు గారే. నిజాయితీపరుడైన అధికారి సాహసానికి ఇదొక మచ్చుతునక. ఎరువులు, గీత కార్మికులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో ఆయన చూపిన చొరవ సహజంగానే అక్కడి ప్రజాప్రతినిధులకు కంటగింపై ప్రతిఫలంగా ఆయనను నక్సలైట్ కలెక్టర్ అని ముద్ర వేశారు.చివరకు 1975లో ఆయనకు అక్కడ నుండి బదిలీ అయింది. ఈ సందర్భంగా ఆయన చెప్పిన"పేదలకు సహాయ పడాలంటే సోషలిస్టు, వామపక్షవాది లేదా ఆ మాటకు వస్తే నక్సలైట్ కానక్కర్లేదు. తటస్థంగా ఉండి సమస్యలను న్యాయంగా వేగంగా యుక్తాయుక్త విచక్షణతో పరిష్కరిస్తే చాలని, ఇంకా చెప్పమంటే అదే చాలా ఎక్కువ అని అంటాను"అని ఆయన పేర్కొన్న మాటలు కార్యనిర్వాహక వర్గానికి క్రొత్త పాఠాన్ని నేర్పిస్తుంది. తర్వాత కాలంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ గా పని చేసిన కాలంలో ఆయన నిర్వహించిన హరిజన మహాసభ అది ఆమోదించిన తీర్మాలను ప్రాతిపదికగా తీసుకొని తర్వాత కాలంలో బాధ్యతలు చేపట్టిన ఎస్.ఆర్. శంకరన్ వాటిని అమలు పరచడానికి 120 జీవోలు తెచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన శంకరన్ గారి గురించి చెబుతూ "ఆయన పేదలను ప్రేమించారు. వారి కోసమే జీవించారు. వ్యక్తిత్వంలో సమున్నతుడు"అని కీర్తించారు. జహీరాబాద్ లో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం సర్వం సన్నద్ధమైన తరుణంలో పట్టణ మాస్టర్ ప్లాన్ కి ముందు పంపిణీ చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు కలగవచ్చని నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి చెప్పి ఒప్పించారు. ఈ సందర్భంలో ఆయన ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు పాఠకులకు అర్థమవుతుంది. కానీ మాధవరావు తొణకని ఆత్మవిశ్వాసంతో, నిబద్ధతతో సహేతుకంగా అప్పటి ముఖ్యమంత్రికి కారణాలను వివరించారు. అది ఆయన నిర్భయత్వానికి నిదర్శనం అని చెప్పవచ్చు.

వివిధ ప్రభుత్వ శాఖల్లో వందలాది మంది తాత్కాలిక ఉద్యోగులను తమ అవసరార్థం నియమించుకునే అధికారులపై ఆర్థిక శాఖ కార్యదర్శిగా తగిన చట్టం చేసి దుబారా ఖర్చును తగ్గించారు. తేదీ 1.7.1997 నుండి 31.10.1998 వరకు ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఇలా ఒక ఉన్నతాధికారిగా ఎన్నో అనుభవాలను ఆయన పంచుకున్నారు.

బహుశా చిన్నప్పుడు తండ్రి తనను అకారణంగా దండించినప్పటి నుండి సున్నిత మనస్కుడైన మాధవరావు జీవితాంతం అదే హృదయగతమై” ఆర్థిక మంత్రి”గా చేరడానికి అడ్డుపడిందేమో అని అనిపిస్తుంది. సృజనాత్మకమైన ఆలోచనలతో వినూత్నమైన కార్యక్రమాలతో కార్యదక్షుడైన అధికారిగా పేరొందిన మాధవరావులో గొప్ప కళాకారుడు కూడా ఉన్నాడు. ఆయన సంగీతం నేర్చుకున్నాడు. మంచి స్వరం. చక్కగా పాడగలడు. ఇంగ్లీషు భాష పై మంచి పట్టు. అదే సందర్భంలో తెలుగులో వచ్చిన బోయ భీమన్న పాలేరు నాటకాన్ని, జాషువా గబ్బిలాన్ని, ఇనాక్ రంధి నవలను, ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. కరుణశ్రీ పద్యాలను రాగయుక్తంగా పాడేవారు. గుర్రపు స్వారీ ఆయనకు సరదా. ఇలా ఎన్నో పార్శ్వాలు ఆయనలో ఇమిడి ఉన్నాయి. ముఖ్యంగా రూపానికి తగిన వ్యక్తిత్వం వ్యక్తిత్వానికి తగిన రూపం కలిగిన అరుదైన అధికారి కాకి మాధవరావు.

సామాన్య కుటుంబం నుంచి"సంకెళ్లను తెంచుకుంటూ..” సమాజాభివృద్ధికి సమున్నత కృషిచేసిన సాహసికుని అంతరంగ ఆత్మకథ ఇది. చదివిన ప్రతి ఒక్కరికి చైతన్యాన్ని అందించే అద్భుతమైన గ్రంథం ఇది.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## అంబేద్కర్ నగర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధం



**జవహర్ నగర్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** జవహర్ నగర్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ప్రముఖ ప్రొపెసర్ కంచ ఐలయ్య ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. అలాగే బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, ప్రజా గాయకురాలు విమలక్క, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, నళికంటి శరత్, డాక్టర్ జీవీ గద్దర్ వెన్నెలతో పాటు జవహర్ నగర్ మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించే దిశగా ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రేరణగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మహాత్మ జ్యోతిరావు పూలే అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు



**యాచారం, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు గురువారం యాచారం మండలానికి చెందిన పలువురు బిజెపి నాయకులు రాంచంద్రారావును కలసి వారి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులకు పదవులు ఇవ్వకుండా కష్టపడని వారికి ఎలా పదవులు ఇస్తారని రాష్ట్ర అధ్యక్షునికి వివరించారు. మండలంలో ఇష్ట రాజ్యాంగ ఒక వర్గానికి చెందిన వారికి పదవులు ఇస్తున్నారని తెలిపారు. మండలంలో అందరూ కలిసికట్టుగా ఉంటే పార్టీ బలోపేతం అవుతుంది. వర్గాలకు కొంతమంది నాయకులు మండల బిజెపి అధ్యక్షులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పార్టీలో నియంతృత్వ ధోరణులు నడుస్తున్నాయని అన్నారు. కొంతమంది మండలానికి చెందిన బిజెపి నాయకులు వారికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే పదవులు కట్టబెడుతున్నారని పార్టీ సమావేశం పెట్టకుండా కృష్ణరాజ్యంగా పదవులు ఎలా ఇస్తారని తెలిపారు ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు మాట్లాడుతూ ఈ విషయంలో సమగ్ర నివేదిక తెప్పించుకొని దీనిపై చర్య తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొండ మధుకర్ రెడ్డి నంది వనపర్తి గ్రామ సర్పంచ్ రాయకండి విజయ్ కుమార్, పురుషోత్తం,దేవరకొండ ఈశ్వర్,వంగూరి సాయి, మారగొని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌ట్యాంక్ స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** కొల్చారం ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం 20 సంవత్సరాల క్రితం రాంపూర్ ఇంద్రనగర్ కాలనీ సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. పక్కనే ఉన్న 373 సర్వేనెంబర్ ఓ కబ్జాదారుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును చుట్టూ ఉన్న భూమిని కబ్జా చేశాడని తెలిపారు. దీనిపై పలుమార్లు రైతుకు తెలిపిన పట్టించుకోకపోవడంతో గురువారం సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ ఉపసర్పంచ్ శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి తాసిల్దార్ శ్రీనివాస్ చారికి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు ఇబ్బందులు ఉండడం వల్ల ఆ ట్యాంకులోకి నీళ్లు సరఫరా చేసి ప్రజల దాహార్తి తీరుస్తానని సర్పంచ్ తెలిపారు కబ్జాదారునికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి. కృష్ణ ప్రశాంత్ గురు ప్రసాద్ శ్రీనివాస్ నాగరాజు కృష్ణ తో పాటు ఉన్నారు.

## సాంకేతిక నైపుణ్యాలతో ప్రతిభను మెరుగుపరుచుకోండి

- విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచనలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని అందులో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం కూకట్‌పల్లి మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, వసతి గృహంలో బోధన పరిస్థితులను పరిశీలించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, ఇతర అభిరుచులలో కూడా ప్రతిభను పెంపొందించుకోవాలని, ప్రభుత్వం అందుకు అవసరమైన శిక్షణను అందిస్తుందని తెలిపారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని, బిడియాన్ని వదిలి తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ స్మార్ట్‌గా పని చేయాలని, సమయాన్ని ఆదా చేసుకోవాలని తెలిపారు. కృత్రిమ మేధస్సు సాధనాల వినియోగం ద్వారా పలు రంగాలలో అవకాశాలు విస్తరించాయని వివరించారు. మంచి అలవాట్లు, విస్తృతమైన అవగాహనతో ముందుకు సాగితే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి తహాసీల్దార్ స్వామి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే బండార్ లక్ష్మారెడ్డి
- ఘనంగా కాప్రా మదర్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం
- లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఏసిపి వెంకట్ రెడ్డి

**కాప్రా, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** సమాజ సేవ కోసం నాయకులను తయారు చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం అండగా నిలుస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ మదర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని రాధిక చౌరస్తాలో గల పరివార్ హోటల్లో క్లబ్ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయనతోపాటు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు డబల్ బెడ్ రూమ్ నివాసాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం, ఆరోగ్య స్కీం అమలుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. పాత్రికేయుల పాత్రకు తమ వంతు సహకారం ఉంటుందని ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న పాత్రికేయులంతా బాగుండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎలా నాలుగు స్తంభాలలో అతి కీలకమైన పాత్రికేయుల వ్యవస్థ ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమాధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ నూతన అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి పేర్కొన్నారు. సమాజం కోసం నాయకుల ఎదుగుదల కోసం సమాజంలోని రుగ్మతల రూపుమాపడానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల ఆర్థిక సామాజిక మానసిక స్థాయికి ప్రతి ఒక్కరు సహకరించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ లో అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూల శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు లక్కడి బాల్రెడ్డి కార్యనిర్వాక కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, కార్యదర్శిగుమ్మడి రోజా రాణి ప్రమాణ స్వీకారం చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ సమాజంలోని అవకతవకలను ఎత్తి చూపే క్రమంలో జర్నలిస్టులు డేగ కన్ను వేయాలన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రముఖ సంఘ సేవకులు లయన్ మాణిక్ రెడ్డి పాత్రికేయ కుటుంబాలకు 32 మందికి కుట్టుమిషన్లను అందజేశారు. కుషాయిగూడ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సబ్ ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సతీష్ విజయ్ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఐలా చైర్మన్ గోవింద్ రెడ్డి, టిఫ్ చైర్మన్ సుధీర్ రెడ్డి చర్లపల్లి ఐల మాజీ చైర్మన్ రోషి రెడ్డి జలంధర్ రెడ్డి, గోపాలరావు, తాటి శ్రీనివాస్ వెంకటేశ్వర్ రెడ్డి,లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి డిస్టిక్ కలెక్టర్ గవర్నర్ కళ్యాణ్ కృష్ణారెడ్డి డిస్టిక్ వైస్ డిస్టిక్ మొదటి గవర్నర్ డాక్టర్ మండా సురేష్, డిస్టిక్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ శేఖర్ రెడ్డి, కాప్రెసరికి లీప్టి కమిషనర్ శ్రీహరి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, బిజెపి అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, సిపిఐ జాతీయ నాయకులు వి ఎస్ బోస్, సిపిఎం నాయకులు యాదగిరిరావు కోమటి రవి, బిజెపి రాష్ట్ర నాయకులు ఏనుగు రాజిరెడ్డి, నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కనుకుల రజినీకాంత్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి, రాంప్రదీప్ మునుగంటి,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి,స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి,గుండారపు శ్రీనివాసరెడ్డి ప్రభుదాస్ పొన్నాల దేవేందర్ రెడ్డి,కమిటీ సలహాదారులు చంద్రమౌళి,కేసి మోహన్, కేసి మోహన్ సత్యనారాయణ, కడియాల రమేష్, కొత్త శ్రీనివాసరావు,, ఉల్లోజు శ్రీనివాస్, కీసరి సహదేవా చారి, వేముల శంకర్, శ్రీరామ్ శ్రీనివాస్, విజయ్ కుమార్, నర్సింగ్ రావు గౌడ్ గుమ్మడి ప్రసాద్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాల విస్తరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. గురువారం కూకట్పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 8 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ. 4.95 కోట్ల పీఎం ఉషా గ్రాంట్స్ నిధులతో జీ౦1 భవనాన్ని ప్రారంభించగా, రూ. 2.84 కోట్ల డీఎంఎఫ్టీ నిధులతో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి కలిసి సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. జీవీ కార్యక్రమం కింద 86 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేసి, ఏడాది పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమగ్ర పాఠశాలల ఏర్పాటుతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. ఆధునిక సాంకేతికత, ముఖ్యంగా కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ చందన మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో 1687 మంది డిగ్రీ, 1700 మంది ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి

**మెదక్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ గురువారం వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలు లీడ్ బ్యాంక్ మేనేజర్, హార్టికల్చర్ ఁ సెరికల్చర్, మత్స్య శాఖ మరియు పశువైద్య శాఖ వారికీ సమావేశం ఏర్పాటు చేసారు. ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతిపై మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించేందుకు పంట వివిధీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. వరి వంటి సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా, పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, పండ్ల పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతులు మంచి లాభాలను పొందగలరని తెలిపారు. పంటల మార్పిడి నీటి వినియోగంలో మితవ్యత, నేల ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలను కూడా ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాల ద్వారా రైతులకు సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ పై సమీక్షిస్తూ.. గాలి కుంట వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పశువైద్యం మందులన్నీ అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. మత్స్యశాఖ పై సమీక్షిస్తూ.. మత్స్య శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలను గుర్తించి ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. జిల్లాలో ఉన్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేపల పెంపకంపై, చేపల ఉపాధి పై అవగాహన కల్పించాలన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు లేని గ్రామాల్లో నూతన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. మత్స్యకార మహిళలకు చేప ఉత్పత్తి వంటకాలు నేర్పించి ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులను పామాయిల్ పంట వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలన్నారు జిల్లాలో పామాయిల్ విస్తీర్ణం పెరగాలని లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, ఎల్‌డి ఎం బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఆధునిక సాంకేతికను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) : రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, విభిన్న పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖల కార్యకలాపాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ గురువారం వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలు లీడ్ బ్యాంక్ మేనేజర్, హార్టికల్చర్ ఁ సెరికల్చర్, మత్స్య శాఖ మరియు పశు వైద్య శాఖ వారికీ సమావేశం ఏర్పాటు చేసారు. ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతిపై మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించేందుకు పంట వివిధీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. వరి వంటి సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా, పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, పండ్ల పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతులు మంచి లాభాలను పొందగలరని తెలిపారు. పంటల మార్పిడి నీటి వినియోగంలో మితవ్యత, నేల ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలను కూడా ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాల ద్వారా రైతులకు సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. పశుసంవర్ధక శాఖ పై సమీక్షిస్తూ.. గాలి కుంట వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పశువైద్యం మందులన్నీ అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. మత్స్యశాఖ పై సమీక్షిస్తూ.. మత్స్య శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలను గుర్తించి ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. జిల్లాలో ఉన్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేపల పెంపకంపై, చేపల ఉపాధి పై అవగాహన కల్పించాలన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు లేని గ్రామాల్లో నూతన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. మత్స్యకార మహిళలకు చేప ఉత్పత్తి వంటకాలు నేర్పించి ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులను పామాయిల్ పంట వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలన్నారు జిల్లాలో పామాయిల్ విస్తీర్ణం పెరగాలని లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య , మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ , ఎల్ .డి ఎం బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుడికి మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి దామోదర

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి సామాన్యులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈమేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ పరిధి జిల్లా ఆసుపత్రిలో 40.5 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన 100 పడకల క్రిటికల్ కేర్ విభాగానికి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన గావించారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టియన్, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ఆర్డీవో వెంకటరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సుదూర దృష్టితో ప్రజాపాలనను అందించడం జరుగుతుందని, గతంలో మరే ప్రభుత్వానికి సాధ్యం కానీ సంక్షేమ పథకాల అమలు తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్పొరేట్ వైద్యం ప్రతి నిరుపేదకు అందేలా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలను తీసుకొస్తుందని, ఇందులో భాగంగానే త్వరలోనే ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కార్డు, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆసుపత్రిగా తీర్చిదిద్దడం, ఇందుకోసం వేల కోట్ల రూపాయలను వెచ్చించడం జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నగరంలో ఎంతో ప్రత్యేక స్థానాన్ని ఆపాదించుకుందని, ఎందుకు తగ్గట్టుగానే జిల్లా ఏరియా ఆసుపత్రిని కొండాపూర్ లో ఏర్పాటు చేయడం, అంచలంచలుగా దానిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తాజాగా 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 100 పడకల క్రిటికల్ కేర్ విభాగాన్ని అభివృద్ధి పరచడం ద్వారా రంగారెడ్డి జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునికతతో కూడిన మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తద్వారా సామాన్యులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని మంత్రి భరోసాను వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రాంతంలో వైద్య సదుపాయాల కల్పనకై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవను చూపడం శుభపరిణామమని, కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో 40.50 కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం భవనం నిర్మాణం పనులకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర రాజనర్సింహ హాజరు కావడం స్ఫూర్తిదాయకమన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ శంకుస్థాపన తర్వాత కొండాపూర్ హాస్పిటల్, డయాగ్నస్టిక్స్ హబ్‌ను మంత్రితో కలిసి తాను సందర్శించడం హర్షనీయమన్నారు. వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులు, తదితర అంశాలపై పేషెంట్లను ఈ సందర్భంగా అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

**• నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాల అనుమతులు జరగాలని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల వద్ద అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక తవ్వకాల అనుమతులు, రవాణా, ప్రభుత్వ ఆదాయం పెంపు, అక్రమ తవ్వకాల నియంత్రణపై సమగ్రంగా చర్చించి కఠిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్లైన్ విధానంలో “మన ఇసుక వాహనం” యాప్ ద్వారానే జరగాలని, ఎట్టి



పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ బుకింగ్ అనుమతించబడదని స్పష్టం చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలపై వచ్చిన దరఖాస్తులను పర్యావరణ అనుమతుల ఆధారంగా పరిశీలించి, తెలంగాణ మినరల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే ఇసుక రవాణా జరిగేలా అనుమతులు ఇవ్వాలని సూచించారు. అలాగే ఇసుక తరలింపుకు దరఖాస్తు చేసిన వాహనాల ద్వారానే రవాణా జరగాలని, వాహన రిజిస్ట్రేషన్ నెంబర్, డ్రైవర్ లైసెన్స్ తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు.గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు లేదా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడితే తప్పనిసరిగా పోలీసుల సహాయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇటీవలే కలెక్టర్ ఇసుక రీచ్ ల వద్ద పరిశీలించిన సందర్భంలో అక్కడ గుర్తించిన పలు అంశాలను కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి వాటిని వెంటనే పరిష్కరించి ఇసుక సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఇసుక తరలింపులు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్ జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, భూగర్భ జల శాఖ అధికారిని దివ్య జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

**వెల్దండ, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** వెల్దండ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఎంపీడీఈసం కృష్ణయ్య గురువారం సందర్శించి కనీస వసతులు ఏర్పాటు చేస్తున్న వివరాలు క్షేత్ర సహాయకుడు, టిఏ లను అడిగి తెలుసుకోవడం జరిగింది. పెద్ద గ్రామం అయినందున కూలీలు కూడా ఎక్కువ సంఖ్యలో వచ్చునట్లు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, మేట్ కు సూచనలు చేయడం జరిగింది. అనంతరం కొట్ర గ్రామ పంచాయతీని సందర్శించి నర్సరీ నిర్వహణను, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఒక్కొక్కరి అభిప్రాయం తెలుసుకోవడం, త్వరగా ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసుకొనుటకు సూచనలు చేయడం, గృహప్రవేశాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల ఇండ్లను సందర్శించి అన్నిపనులు పూర్తి చేసుకొనుటకు సూచనలు చేయడం జరిగింది. అలాగే ఆ గ్రామ నర్సరీని సందర్శించి గ్రామంలో ఎక్కువ మందిని పనిలో పెట్టుటకు మేటి మరియు పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్శనలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీవో ఈశ్వర్ జీ, పల్లవి, హౌసింగ్ ఏఈ మరియు పంచాయతీ కార్యదర్శులు గిరి గౌడ్ ,భాస్కర్ మంజుల, చెన్నయ్య మేట్స్ పాల్గొనడం జరిగింది.



## మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**మక్తల్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని సత్యావార్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో 3 కోట్ల తో నిర్వహించనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తుందని వెల్లడించారు. ఇప్పటికే నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 11 ఆర్టీసీ అద్దె బస్సులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇలా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు కూడా దిగ్విజయవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి కితాబునిచ్చారు. మహిళా సంఘాలు అడిగినవెంటనే బ్యాంకులు 20 లక్షల రూపాయల రుణాలు మంజూరు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆడబిడ్డలు తమ తమ పిల్లలను మంచిగా చదివించాలని,మీ పిల్లల భవిష్యత్తు ను చదువు మాత్రమే మారుస్తుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సత్యావార్ గ్రామ సర్పంచ్ అనురాధ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్, సంబంధిత అధికారులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం

**• జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలోలి భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద నాలుగో రోజు లిఎయిడ్స్ పై అవగాహన, నివారణ దినోత్సవంలి సందర్భంగా గురువారం లిరెడ్ రన్‌లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ , ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత ,డి సి హెచ్ ఎస్ శివ దయాల్, నర్సింగ్ కాలేజ్ బాలికలు హాజరై, ఈ లిరెడ్ రన్ వాకథాన్ ర్యాలీనిలి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి రామ్ దాస్ చౌరస్తా వరకు వరకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ఈ లిరెడ్ రన్ వాకథాన్ ర్యాలీనిలి చేపట్టారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్‌లి మాట్లాడుతూ.. జిల్లాలో ఎయిడ్స్ (హెచ్ఐవి ఎయిడ్స్) వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని (ఇంకరబుల్) వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం (ఇన్ఫెక్టెడ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్), వాడిన సిరంజీల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను పాటిస్తూ, జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో కూడా (385) హెచ్.ఐవిఎయిడ్స్ కేసులు) బాధితులకు జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వఆస్పత్రిలో లో గల ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ మేరకు బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. రాందాస్ చౌరస్తాలో ఎయిడ్స్ నివారణపై అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ. ఎటువంటి భయోందాలకు గురికాకుండా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించుకోవాలని పాజిటివ్ అని నిర్ధారణ అయితే తగు జాగ్రత్తలు తీసుకుంటూ హెచ్ఐవి వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో వైద్య అధికారులు, ఆశాలు, సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు పట్టుకొని “ఎయిడ్స్ నివారణ” నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాలో వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** జిల్లాలో వంట గ్యాస్, సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్ అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు సివిల్ సప్లై అధికారి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ జిల్లాలో గ్యాస్ వినియోగంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు జిల్లా స్థాయి గ్యాస్ పంపిణీ విస్తరణపై, సివిల్ సప్లై అధికారులు, జిల్లాలో గ్యాస్ సరఫరా, వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ సిలిండర్లు అక్రమ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేసే జిల్లాలో అక్రమ సిలిండర్ ల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అధికారుల బృందం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసి అవసరమైన సందర్భాల్లో కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీస్ రెవెన్యూ సివిల్ సప్లై అధికారులతో ప్రత్యేక బృందాలతో జిల్లాలో ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా వినియోగించే సిలిండర్లు జప్తు చేసుకొని క్రిమినల్ కేసులు బుక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గ్యాస్ డీలర్లు గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు అక్రమంగా వినియోగిస్తే డీలర్లు లైసెన్స్ ను రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూ గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. అలాంటి ఫిర్యాదులపై అవసరమైన చర్యలను పోలీస్ శాఖ తప్పకుండా తీసుకుంటుందని ఎస్పీ సూచించారు.




# మహిళలకు అన్ని రంగాల్లో ప్రభుత్వ అండ

- **బేటి బచావో బేటి పడావో కింద కుట్టు యంత్రాల పంపిణీ**
- **బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభం**
- **టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అండ ఉంటుందని టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. బేటి బచావో–బేటి పడావో పథకం కింద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో–బేటి పడావో పథకం కింద సంగారెడ్డి స్థానిక బాలసదనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బేటి బచావో––బేటి పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణలతో మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ మాట్లాడుతూ మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ,డిసిపిఓ రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.




## కేరళ ప్రభుత్వం పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సరికాదు



**సదాశివపేట, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** కేరళలో ఎల్డీఏ ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని కేరళ సీఎం పిన్నరై విజయనిపై సీఎం రేవంత్ ఆరోపణలు సమంజసం కాదని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జాలాలోద్దీన్ అన్నారు. గురువారం సదాశివపేటలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జాలాలోద్దీన్ మాట్లాడుతూ... అమెరికా యుద్ధకాండ పై భారత ప్రధానమంత్రి మోడీ ఎందుకు స్పందించడం లేదని గ్యాస్ పెట్రోల్ కొరకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని కి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఇంత జరుగుతున్నా మోడీకి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కేరళ సీఎంను సీఎం రేవంత్ రెడ్డి పదేపదే విమర్శించడం తగదన్నారు. ఎన్నికల ప్రచారం కోసం కేరళ వెళ్ళిన తెలంగాణ సీఎం ఎన్నికల హామీలను అమలు చేశామని చెబుతున్నారని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని అమలు అయ్యాయో తెలుసన్నారు. అత్యంత దుర్భర జీవితాలను అనుభవిస్తూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను పైకి తెచ్చిన చరిత్ర కేరళ ప్రభుత్వాని దని చెప్పారు. కేరళలో నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించడంతోపాటు అక్కడ డిగ్రీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నారని తెలంగాణలో ఎక్కడ ఉచిత విద్య అందుతుందో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహమాన్, సిపిఐ జిల్లా నాయకులు తాజోద్దీన్, షఫీ అహ్మద్, శంకరప్ప, పాండు, ముస్తఫా, బుజ్జమ్మ, రమేష్, గంగమ్మ, పూలమ్మ, బిపాషా, కళావతి, సాధిక్ అలీ, టాస్లీమా, గౌస్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

**• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ‘అరైవ్ అలైవ్’ రోడ్డు భద్రత వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డితో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారం రోజులపాటు రోడ్డు భద్రతపై రోజువారి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తద్వారా రోడ్డు భద్రత పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేశారు. గ్రామస్థాయి నుండే హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, రోడ్డు భద్రత నియమాలు పాటించడంపై ప్రతిజ్ఞలు చేయించాలని సూచించారు.డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వ తేది నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 13వ తేదీన గ్రామీణ స్థాయిలో రోడ్డు భద్రత కోసం కమిటీలు వేసి, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వారం రోజులపాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా విద్యార్థులచే ర్యాలీలు, మండల స్థాయి కార్యక్రమాలు, వాహన చోదకులకు, డ్రైవర్లకు కంటి పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ్యస్వామ్యం చేయాలని అన్నారు. పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీన స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. 16వ తేదీన మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ట్రాఫిక్ నియమాలు పాటించని వారికి, రోడ్డు భద్రత నియమాలు పాటించని వారికి చలానాలు కఠినంగా విధించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ కరెక్ట్‌గా పాటించే వారికి ప్రోత్సాహం చేయాలన్నారు. చిన్నారులతో ట్రాఫిక్ నియమాలపై ప్రతిజ్ఞ చేయించడం, సామాజిక మాధ్యమాల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్పి బాలాజీ నాయక్, ఆర్ అండ్ బి డిఈ దేశ్యా నాయక్, డీఎంహెచ్వో సాయినాథ్ రెడ్డి, డిటిఓ మానస, డిపిఓ రఘునాథ్, డివైస్ ఓ సుధీర్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబానికి అంగన్వాడీ సేవలు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యం

- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** ప్రతి కుటుంబానికి అంగన్వాడీ సేవలను చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి, చిత్తశుద్ధితో పని చేయాలని, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సేవలను సాంకేతికతతో మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ స్మార్ట్ ఫోన్లను అందజేస్తున్నామని చెప్పారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా డేటా ఎంట్రీ, హాజరు నమోదు, పోషకాహార వివరాలు, ఆరోగ్య సమాచారాన్ని సరైన విధంగా పారదర్శకంగా నమోదు చేయాలని, దీని వల్ల సేవల పర్యవేక్షణ సులభతరం అవుతుందన్నారు. అంగన్వాడీ టీచర్లు ఈ ఫోన్లను సమర్థవంతంగా వినియోగించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో చేరేలా కృషి చేయాలని సూచించారు. అలాగే, పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి లబ్ధిదారునికి సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ఏ సమస్య ఉన్నా కూడా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా ఈ స్మార్ట్ ఫోన్లను సరిగా ఉపయోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల కోసం ప్రభుత్వ భవనాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రైవేట్ భవనాల వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని, వారంలోగా అందుకు సంబంధించిన అంచనాల నివేదికను తమకు సమర్పించాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.. అంగన్వాడీల్లో మెరుగైన సేవలు అందించే దిశగా టెక్నాలజీని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని, లబ్ధిదారుల వివరాలను క్లుప్తంగా ఆయా యాప్ లలో నమోదు చేయాలని సూచించారు. తదనంతరం జిల్లాకు సంబంధించి సెక్టార్ ల వారీగా అంగన్వాడీ టీచర్లు, బ్లాక్ కో-ఆర్డినేటర్ లు, ఐసిడిఎస్ సూపర్వైజర్ లకు వారు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కోదండరాములు, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, మిషన్ శక్తి కో-ఆర్డినేటర్ శారద, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్ ప్రారంభం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రైతులు సమస్యల పరిష్కారం కోసం 9347416178 నంబర్ కు కాల్ చేయండి



**ములుగు బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** యాసంగి (రబీ) 2025-26 సీజన్ కలెక్టరేట్ లోని సివిల్ సప్లై కార్యాయం లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు9347416178 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి (రబీ) 2025-26 సీజన్ ప్రారంభమైన సందర్భంగా ములుగు జిల్లాలోని వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయం లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం, రవాణా, మద్దతు ధర ఇతర సాంకేతిక ఇబ్బందులు తలెత్తినప్పుడు రైతులకు కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందని, సమస్యల ఫిర్యాదుల కోసం 9347416178 నంబర్ను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా పౌరసరఫరాల శాఖ అదికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,సివిల్ సప్లై డియం కృష్ణవేణి,డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని , అన్యాక్రాంతం అయితే కఠిన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ప్రభుత్వ భూములు, చెరువులు పరిరక్షణ, కోర్టు కేసులు, కౌంటర్లు దాఖలు తదితర అంశాలపై భూపాలపల్లి నియోజకవర్గ రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, సింగరేణి తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఎన్నో సంవత్సరాలుగా సాగుచేస్తున్నప్పటికీ భూ హక్కు పత్రాలు లేని భూముల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులను గుర్తించి సమగ్ర సర్వే నిర్వహించి భూ హక్కు పత్రాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు.ఎన్నో ఏళ్లుగా భూమిని సాగు చేస్తున్నా హక్కు పత్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూమిని అమ్ముకోవడానికి వీలు లేకపోవడం, పంట రుణాలు, రైతు భీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు అందకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అలాంటి అర్హులైన రైతులందరికీ భూ హక్కు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ భారతి మరియు సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు అర్హులకు ఇండ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ చేయాలని, మిగిలిన భూములను సోలార్ ప్రాజెక్టులు మరియు పరిశ్రమల స్థాపనకు వినియోగించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడానికి లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని సర్వే అండ్ ల్యాండ్ ఏడికి సూచించారు. సర్వే కోసం నిర్ణయించిన గడువులో పనులు పూర్తి అయ్యేలా ఆర్డీఓ తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అటవీ భూముల సమస్యల పరిష్కారానికి సంయుక్త సర్వే నిర్వహించి హద్దులను ఖచ్చితంగా నిర్ణయించాలని తెలిపారు. సాగుచేస్తున్న రైతుల వివరాలను గ్రామసభల్లో వివరించాలని అభ్యంతరాలను వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకం



**భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు భారత ప్రభుత్వం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ను ప్రారంభించినట్లు పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ్ తెలిపారు. ఈ పథకం ద్వారా అగ్రశ్రేణి కంపెనీలలో వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశాలను యువతకు అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులు ప్రముఖ కంపెనీలలో పరిశ్రమలలో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కల్పిస్తారని అన్నారు. ముఖ్యంగా ఎంపికైన ఇంటర్న్‌లకు నెలకు సుమారు 9 వేలు వరకు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. అదనంగా ఇంటర్న్‌షిప్‌లో చేరిన సమయంలో ఒకేసారి 6 వేలు గ్రాంట్ కూడా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ వ్యవధి 6 లేదా 9 నెలలు ఉండగా అభ్యర్థులు 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం పూర్తి కాల ఉద్యోగంలో ఉన్న వారు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా యువత అనుభవజ్ఞుల నుండి మెళకువలు నేర్చుకునే అవకాశం కలుగుతుందని, భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలకు అవకాశాలు అర్హులవుతారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ pminternship.mca.gov.in ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 116 090 ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని, అలాగే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. యువత ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జీఎం సిద్ధార్థ పిలుపునిచ్చారు.

## సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 9, (జనంసాక్షి) :** సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ లతో కలిసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎల్.పి.జి. సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, పైప్‌లైన్ సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, అనుమతుల ప్రక్రియను సరళీకరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులకు సంబంధించిన అనుమతులను 24 గంటలలో మంజూరు చేసే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ఆలస్యం అయితే 'డీమ్డ్ పర్మిషన్ గా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సంబంధించిన రెంటల్/లీజ్ ఛార్జీలను తాత్కాలికంగా మాఫీ చేయడం జరిగిందని, పనుల వేగవంతానికి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలకు 24 గంటల పని సమయం, శబ్ద కాలుష్యం నిబంధనలను పాటించేలా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## పిఎన్జీ, సీఎన్జీ గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- కలెక్టరేట్ లో జిల్లాస్థాయి సిటి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ సమావేశం




**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్జి), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్జి) వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మేఘా పైప్ లైన్ న్యాచురల్ గ్యాస్ వారి ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టనున్న గ్యాస్ సరఫరాకు సంబంధించి పౌర సరఫరాలు, పోలీస్, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, విద్యుత్, పంచాయతీ, ఇతర శాఖలతో పాటు మేఘా గ్యాస్ ప్రతినిధులతో జిల్లా స్థాయి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) విస్తరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ లో భాగంగా గృహ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్జీ)లను సరఫరా చేసేందుకు పైప్ లైన్ల ద్వారా చేపట్టే ప్రక్రియ గురించి మేఘా గ్యాస్ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వివరించారు. గ్యాస్ సరఫరాకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టర్ మేఘా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఎక్కడెక్కడ మేఘా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) గ్యాస్ సరఫరా అవుతుంది, జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని రిజిస్ట్రేషన్స్ అయ్యాయని, గ్యాస్ సబ్సిడీ గురించిన వివరాలను గ్యాస్ సంస్థ ప్రతినిధి అవినాష్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించి అనుమతుల కోసం నోడల్ అధికారిగా పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్ వ్యవరిస్తారని అన్నారు. ఈ గ్యాస్ వినియోగానికి దరఖాస్తు చేసే విధానాన్ని ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఎలా దరఖాస్తు చేయాలో సంబంధిత పోర్టల్ గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. వాణిజ్య, గృహ అవసరాలకు సౌకర్యవంతంగా ఉంటుందని, నిరంత గ్యాస్ సదుపాయంగా ఉంటుందని తెలిపారు. తక్కువ ధర, సురక్షిత సదుపాయాలు కల్పిస్తునందున ప్రజలకు అవగాహనా కల్పించాలన్నారు. సిటి పరిధిలో గ్యాస్ కొరత నుండి సరియైన సదుపాయాలు కల్పించడం మొదలగు విషయాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, మేఘా గ్యాస్ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ అవినాష్, డీసీఎస్వో వాజిద్ అలీ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, హనుమకొండ ఏసీపీ నరసింహరావు, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, జీఎం నవీన్ కుమార్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మా రామ్, ఇతర శాఖల అధికారులు, మేఘా గ్యాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

**భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం,ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీలో మార్చి 23న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులు జింక నాగరాజు , బొబ్బిలి సదయ్య లను గుర్తించి వారి వద్ద నుండి దొంగలించిన బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకోవడం జరిగిందని భూపాలపల్లి పట్టణ సిఐ నరేష్ కుమార్ తెలిపారు. గురువారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక



**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన సమావేశంలో ఐదుగురు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక జరిగింది. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ ధరణి మధుకర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు . డిప్యూటీ చల్ల రమ్య, కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ పర్యవేక్షణలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక జరిగింది. కొత్తగా ఎన్నుకున్న కోఆప్షన్ సభ్యులలో కొండ పద్మ చంద్రశేఖర్, కలువల జాన్ జగన్మోహన్ రావు , జుబేర్ అహ్మద్, బెంజిమెన్ ,తుముసుము ఉన్నారు.

## అంగన్వాడీల సేవలు వెలకట్టలేనివి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి) :**మడికొండలోని మా గార్డెన్స్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ కార్యక్రమానికి శాసనసభ్యులు కేఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సేవలు సమాజానికి అమూల్యమైన వని, వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. డిజిటల్ సాంకేతికత వినియో గంతో అంగన్వాడి సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతాయని అభిప్రాయపడ్డారు.పిల్లల మానసిక స్థితిని గుర్తించడం, వారి అభివృద్ధిని పర్యవేక్షించడం కూడా అంగన్వాడి టీచర్ల బాధ్యతలో భాగమని తెలిపారు. ఆటిజం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సరైన వైద్యం అందించవచ్చని, ఇందులో వారి పాత్ర ముఖ్యమని వివరించారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ, ప్రతి మహిళ ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతమవుతుందని అన్నారు. అంగన్వాడి వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళల సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామ్ రెడ్డి, బి డబ్ల్యు ఓ విశ్వజ, సిడిపిఓ స్థానిక ప్రజా ప్రతినిధులు అంగన్వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమయపాలనతో మెరుగైన సేవలు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ కలెక్టర్ కె. హరిత





**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09(జనంసాక్షి ):** ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటి స్తూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, పరికరాలు అందుబాటులో ఉంచి ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రోగులతో స్నేహభావంతో వ్యవహరించాలని, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్ తదితర పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చి పడకల సామర్థ్యాన్ని 50 నుంచి 330కు పెంచినట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఖాళీ స్థలాన్ని పార్కింగ్కు కేటాయించడం, మెడికల్ షాప్, జిరాక్స్, క్యాంటీన్ వంటి సౌకర్యాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసి వచ్చే ఆదా యాన్ని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అలాగే మార్చురీ వ్యాన్, అంబులెన్స్, ఆపరేషన్ థియేటర్ పరికరాలు, సిబ్బంది నియామకానికి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోధ్ కుమార్, వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిప్పులపాలైన రైతు కష్టం

- కుబీర్ మండలంలో రెండెకరాల మొక్కజొన్న దగ్ధం



**కుబీర్, ఏప్రిల్ 09, (జనంసాక్షి):** ఆరు గాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే వేళ.. అగ్నిప్రమాదం రూపంలో ఆ రైతుకు తీరని అన్యాయం జరిగింది. కుబీర్ మండల పరిధిలోని గోడాపూర్ గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదం ఓ రైతు కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. గ్రామానికి చెందిన సిందే రంగారావు అనే రైతు తన పొలంలో ఎంతో ఆశతో మొక్కజొన్న సాగు చేశారు. గురువారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పంట పొలం అగ్నికీలల మధ్య చిక్కుకుంది. ఎండ తీవ్రతకు తోడు గాలి తోడవడంతో నిమిషాల వ్యవధిలోనే పచ్చని పంట కాస్తా బూడిద కుప్పగా మారింది. మంటలను గమనించిన స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ. 1.50 లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
10 ఏప్రిల్ 2026

# మధిర అభివృద్ధికి 'భట్టి' బాట!

- దేశం మొత్తానికి మధిర నియోజకవర్గంతో అనుసంధానం
- పెద్ద ఎత్తున రోడ్లు, రైల్వే లైన్ల నిర్మాణం
- వంగమూడి దగ్గర ఎత్తిపోతలతో ఎర్రుపాలెం మొత్తానికి సాగునీరు
- ములుగుమాడు సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**మధిర, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** పెద్ద ఎత్తున రోడ్లు, రైల్వే లైన్ల నిర్మాణంతో దేశం మొత్తానికి మధిర నియోజకవర్గంతో అనుసంధానం అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో కట్టలేరు ఆనకట్ట, కాలువల మరమత్తు పనులకు శంకుస్థాపన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. 2009 సమయంలో ఎర్రుపాలెం మండలానికి ఎరువుల లారీలు రావాలన్న వచ్చే పరిస్థితి లేకుండా పోయేది లారీలు వస్తే దిగబడి పోతాయన్న భయం ఉండేది. ఆనాటి నుంచి రోడ్లపై దృష్టి పెట్టి పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని రాబోయే రోజుల్లో పెద్ద మొత్తంలో రోడ్డు వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైరా నుంచి బోనకల్లు క్రాస్ రోడ్డు అక్కడ నుంచి మధిర అక్కడినుంచి ఎర్రుపాలెం. ఖమ్మం నుంచి బోనకల్లు మీదుగా ఎర్రుపాలానికి ఎటు చూసినా నాలుగు లైన్ల రహదారులు నిర్మాణం జరగనున్నయని తెలిపారు. పక్కనే ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అభివృద్ధి చెందితే చుట్టుపక్కర ప్రాంతాల నుంచి పాలు, ఇతర అవసరాలు ఈ ప్రాంతాల నుంచి వెళ్లాల్సి ఉంటుంది అందుకు



గ్రీన్ ఫీల్డ్ హైవే, ప్రత్యేక రైల్వే ట్రాక్ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కట్టలేరు ఆనకట్ట కాలువల మత్తు పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచులు జూన్ రెండు నుంచి ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి అల్పాహారం మధ్యన్న భోజనం పథకాలను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల నేపథ్యంలో రైతు ఆత్మహత్య



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** భూ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం గూడూరు పాడు గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... గూడూరు పాడు గ్రామానికి చెందిన బండి రామయ్య(52) అనే వ్యక్తి గత కొద్ది కాలం వరకు గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనాధారం గడుపుతున్నాడు. ఇటీవల తన సొంత వ్యవసాయ భూమిని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ గ్రానైట్ వ్యాపారికి అమ్మాడు. అయితే భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి గత కొద్ది నెలలుగా క్వారీకి వెళ్లే దారి వెడల్పు మరింత కావాలని రామయ్యని అడుగుతున్నట్లు సమాచారం. ఈ సమయంలో ఇద్దరి మధ్యలో తరచుగా గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో రామయ్య క్వారీ యజమాని, నిర్వాహకులు పెడుతున్న ఇబ్బందిని ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని గురువారం తెల్లవారుజామున క్వారీ దగ్గరికి వెళ్లిన రామయ్య క్వారీలో ఉన్న భారీ వాహనానికి ఉరివేసుకొని చనిపోయినట్లు తెలుస్తోంది. అయితే రామయ్య మరణానికి గల కారణం భూవివాదాలేనా మరి ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది. రామయ్య మరణ వార్త తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. గూడూరుపాడు గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకై విస్తృత అవగాహన కల్పించాలి




**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యవారం కార్యక్రమంలో భాగంగా 4వ రోజు నిర్వహించిన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ర్యాలీ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన జీవన రక్షణ, సురక్షిత జీవితం ఆరోగ్య భవిష్యత్ వంటి నినాదాలతో ప్రజలకు సందేశాలు అందించారు. బ్యానర్లు, పాంప్లెట్ల ద్వారా వ్యాధి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై సరైన అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తి విధానాలైన రక్త మార్పిడి, సూదులు సిరంజీలు, తల్లి నుండి పిల్లలకు సోకకుండా గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ఈ విషయాల గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు విస్తృతంగా అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తిని నివారించాలని సూచించారు. డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ ఎండి షఫీ ఉల్లా, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్ర శేఖర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు నాజియా, శ్రీశైలం, శ్రావణి ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంత కుమార్, అమూల్య, ప్రణీత్, వాసవి, వార్డ్ కౌన్సిలర్లు రాజేశ్, ఈద ప్రవీణ్, రాపర్తి భవాని, జ్యోతి శ్రీవిద్య, ఎస్ఓ పి.వీరయ్య, డిప్యూటీ డిఈఎంఓ సంజీవ్ రెడ్డి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**తుంగతుర్తి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగానే ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయని స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి లు అన్నారు, గురువారం మండల పరిధిలోని వెలుగు పల్లి గ్రామంలో గల మల్లన్న గుట్ట వద్ద 15 కోట్లతో పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాములకు భూమి పూజ చేసి మాట్లాడారు, ఈ గోదాములతో తుంగతుర్తి ప్రాంత రైతులు పండించిన పంటలకు నిల్వ చేసుకునే సదుపాయం కలుగుతుందన్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తూ ముందుకు పోతుందని వారు అన్నారు. ప్రజలే మా ప్రభుత్వానికి బలం అని వారి సంక్షేమం, అభివృద్ధే మా లక్ష్యం అన్నారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండేలా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా డిసిసి అధ్యక్షుడు గుడిపాటి



నరసయ్య, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, గ్రామ సర్పంచ్ సోలిపురం అశ్విని, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు యోగానంద చారి, రేగటి రవి, గిడ్డంగుల సంస్థ డి.ఈ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచులు, వెలుగుపల్లి గ్రామ కార్యదర్శి రఘు, కాంగ్రెస్ పార్టీ యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధిద్దాం

- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి

**అబ్దుల్లాపూర్మెట్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** స్వాతంత్ర సమరయోధుడు, సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 32వ వర్ధంతి సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ, భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ చంద్ర రాజేశ్వరరావు సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. భూమిలేని నిరుపేదల కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయన ఎన్నో ఉద్యమాలు నడిపారని చెప్పారు. "నాకు ఆస్తిపాస్తులు లేవు, ఎవరి దగ్గర నుండి ఏమీ తీసుకోలేదు" అనే ఆయన మాటలు అనేక మందికి స్ఫూర్తినిచ్చాయని



అన్నారు. ఆదివాసీలు, ముస్లిం మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు ప్రత్యక్షంగా వెళ్లి వారికి అండగా నిలబడి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. నేటి తరాలు చంద్ర రాజేశ్వరరావు జీవితం నుంచి ప్రేరణ పొందుతూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, నాయకులు సాయిలు, పేరాల గోపి, వినోద్ నాయక్, సైదులు ముదిరాజ్, రాములు, గణేష్, దేవమ్మ, క్రాంతి, రమేష్ నాయక్, లక్ష్మీ, లింగం, ఆవుల యాదగిరి, ప్రియా, సుధాకర్, అశోక్, శోభన్, అన్నపూర్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మేలు జరిగేలా చూడాలి



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట రూరల్ మండలం ఎర్కారం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, వడ్ల మిల్లులను కూడ గుర్తించడం జరిగిందని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రావచ్చని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బేసిక్ మౌలిక సదుపాయాలైన వేయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, తాగునీరు, టెంట్లు, వర్షాలు వస్తే అత్యవసరం పరిస్థితులలో టార్పలిన్ పట్టాలు, ట్యాజింగ్ మిషన్లు, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. 2,3 మండలాలకు కలిపి ఒక ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ ను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లాస్థాయిలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీని ఏర్పాటు చేశామని, వీరు ఆయా మండలాల పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తారని అన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కాంటాలు వేయాలని సూచించారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆలస్యం లేకుండా 2 లేదా 3 రోజుల్లో వరి ధాన్యానికి కాంటాలు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్ బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్, అధికారులు, పిఏసిఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామరావు



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** రబీ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ కె.సీతారామరావు అన్నారు. గురువారం చివ్వెంల మండలంలోని రాంకోటి తండా, సూర్యాపేట మండలంలోని రాయినిగూడెంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అధికారులను సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం నేపథ్యంలో ఎండలు ఎక్కువగా ఉన్న క్రమంలో ధాన్యం తేమ శాతంలో ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. తాలు, తరుగు సమస్య కూడా లేనందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. హమాలీల సమస్య లేకుండా చూసుకోవాలని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఓపిఎంఎస్ లో నమోదు చేసి ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకొని, కేంద్రాల వద్ద మౌలిక వసతులను కల్పించాలన్నారు. తేమ శాతం కొలిచే పరికరాలు, బరువు చూసే యంత్రాలను సక్రమంగా పని చేసేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల తహసీల్దార్ చంద్రశేఖర్, సూర్యాపేట తహసిల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు క్లినిక్‌ను పరిశీలించిన ప్రభుత్వ వైద్యాధికారి



**మునగాల, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఇటీవల వైద్యం వికటించి ఓ వ్యక్తి మరణించిన సంఘటనపై గురువారం స్థానిక ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ రవీందర్ ఘటనకు కారణమైన ప్రైవేటు వైద్యుడు మండవ శ్రీనివాస్ క్లినిక్ ను సందర్శించి విచారణ చేయగా, ఈనెల 5వ తేదీన మండల కేంద్రానికి చెందిన అనంతుల శ్రీశైలం కడుపు ఉబ్బరం, చాతి నొప్పి, కడుపు నొప్పి ఉన్నదని ఆర్ఎంపి శ్రీనివాస్ కు ఫోన్ ద్వారా తెలపగా, దీంతో ఆర్ఎంపి శ్రీనివాస్ శ్రీశైలం నివాసానికి వెళ్లి న్యూరో క్సైండ్, ఓమికాండ్, పాన్ టాప్, ఎవిల్ 1 సిసితో పాటు ఆర్ఎల్ సెలైన్ బాటిల్ పెట్టి వైద్యం నిర్వహిస్తుండగా శ్రీశైలం అపస్మారక స్థితిలోకి వెళ్లి వెంటనే మరణించాడు. ఇట్టి విషయంపై ఆర్.ఎం.పి చేసిన వైద్యం వికటించి శ్రీశైలం మరణించాడని బంధుమిత్రులు ఆరోపిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు శ్రీశైలం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శ్రీశైలం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇట్టి విచారణ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు గురువారం డాక్టర్ రవీందర్ విలేకరులకు తెలిపారు.

## కోర్టు తరలింపుపై రెండో రోజూ న్యాయవాదుల ఆందోళన



**భువనగిరి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** భువనగిరి జిల్లా కోర్టును రామన్నపేటకు తరలించే నిర్ణయంపై న్యాయవాదుల నిరసన రెండో రోజుకూ కొనసాగింది. కోర్టు తరలింపును వ్యతిరేకిస్తూ న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నిసంగి విద్యాసాగర్ మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా రామన్నపేటకు కోర్టును తరలించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రాంతానికి కోర్టును మార్చితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించి న్యాయమూర్తులను కలిసి తమ విన్నపాలు వివరించినట్లు తెలిపారు. కోర్టు తరలింపును నిలిపివేయించే వరకు తమ పోరాటం ఆగదని, న్యాయవాదుల హక్కుల కోసం వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడబోయిన యాదగిరి, శారద, ఉడుతల సురేష్, పడాల శ్రీనివాస్, పటేల్ పత్తిపాటి ప్రసాద్ రావు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందరికీ అందాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**షాబాద్, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చొరవ చూపుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని మిద్దెశీ గూడ కు చెందిన డోలు బాలమణి కృష్ణయ్య కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... పేదింటి బిడ్డ పెళ్లి ఘనంగా జరుపుకునేందుకే కళ్యాణ లక్ష్మి అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో ప్రజల ఇంటి కల నెరవేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, తహసిల్దార్ అన్వర్, ఎంపీడీవో అపర్ణ, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ మీద ఆధారపడకుండా సహజ వాయువు ఉపయోగించేలా చర్యలు

- కలెక్టర్ బి.చంద్ర శేఖర్

**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లాలో పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. దీనివల్ల వాణిజ్య ఎల్పిజి పై ఆధార పడడాన్ని తగ్గించేందుకు జిల్లా స్థాయిలో గ్యాస్ పంపిణీ విస్తరణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో పౌరసరఫరాలు, పరిశ్రమలు పంచాయత్ రాజ్, విద్యుత్ పోలీస్ శాఖల అధికారులతో ఈ విషయంపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా ఇంధన సరఫరాలలో అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో, ముఖ్యంగా వాణిజ్య



విభాగంలో ఎల్పిజి లభ్యతపై ప్రభావం పడుతున్నందున, పిఎన్జీ సరఫరాను విస్తరించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లను వేగంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, మెగా సిటీ గ్యాస్ ప్రాజెక్టు వలిగొండ నుండి నార్కట్‌పల్లి వరకు విస్తరించి ఉందని తెలిపారు. ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక ట్యాంక్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్యాస్ పైప్‌లైన్‌లను ఇంటింటికి అందించే విధంగా వేగంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నార్కట్‌పల్లి నుండి నల్గొండ వరకు పైప్‌లైన్ ద్వారా 5 గ్రామాలను కలుపుతూ టాప్ అప్ పాయింట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరంగా గ్యాస్ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎఎస్పీ రమేష్, పౌరసరఫాల శాఖ అధికారి వెంకటేష్, పరిశ్రమ శాఖ అధికారి సతీష్ ఆర్ అండ్ బిఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి శేఖర్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ శరత్చంద్ర సంబంధించిన అధికారులు హాజరయ్యారు.

## దమ్మపేట 108 అంబులెన్స్‌పై సమగ్ర ఆకస్మిక తనిఖీ



**దమ్మపేట, ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** దమ్మపేట మండల 108 అంబులెన్స్ సేవలను జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ కేంద్ర కార్యాలయం హైదరాబాదు నుండి వచ్చిన ఆడిటర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అడిట్ సూపర్వైజర్ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న మెడికల్ పరికరాల పనితీరు, మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, నిర్వహణ రికార్డులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా అత్యవసర కేసుల నిర్వహణ విధానం, సేవల సమయపాలన, సిబ్బంది పనితీరును కూడా సమీక్షించారు. మందుల నిర్వహణ సక్రమంగా ఉండటం, మెడికల్ పరికరాలు సమర్థంగా పనిచేయడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది విధి నిర్వహణను మెచ్చుకుని, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 108 మేనేజర్ మనోహర్, ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్ పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రాము, వాహన డ్రైవర్ పైలెట్ లాల్‌సింగ్ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ తనిఖీ నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.




# 5 రోజుల వరుస లాభాలకు బ్రేక్..

## సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లు పైకి కనిపించినా.. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడు రాజుకుంటాయోనన్న భయాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దాడులకు ప్రతిగా హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, ఎఫ్ఐఐల విక్రయాలూ తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,319.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,562.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కనిపించింది. ఇంట్రాడేలో 76,347.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 931.25 పాయింట్ల నష్టంతో 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో మళ్లీ ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ప్రకటనతో 95 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర.. మళ్లీ 98.42 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ 4728 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఒక్కో షేరుకు రూ.31 డివిడెండ్

ముంబయి: ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభంలో 12.22 శాతం వృద్ధి కనబరిచింది. గతేడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.12,224 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించగా.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10,657 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.49,210 కోట్ల నికర లాభం పొందింది. సమీక్షిస్తున్న త్రైమాసికానికి గానూ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 9.64 శాతం వృద్ధితో రూ.64,479 కోట్ల నుంచి రూ.70,698 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 4.58 శాతం వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.31 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. కృత్రిమ మేధ (ఏఐ) సంబంధిత సేవల ద్వారా వచ్చే వార్షిక ఆదాయం 2.3 బిలియన్ డాలర్లు దాటినట్లు వెల్లడించారు. నాలుగో త్రైమాసికంలో నికరంగా 2,000 మందికి పైగా ఉద్యోగులు కంపెనీలో చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,84,519కి చేరింది. అయితే, వలసల రేటు (అట్రిషన్ రేటు) స్వల్పంగా పెరిగి 13.7 శాతానికి చేరింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు విలువ 1.09 శాతం లాభంతో రూ.2587.75 వద్ద ముగిసింది.


## వెండిని తిరిగి కొనుగోలు చేస్తాం..
## ఎంఎంటీసీ-పాంప్ కొత్త సేవలు

బంగారం, వెండి విక్రయించడమే కానీ.. నగదుపై కొనే సంఘటిత సంస్థలు ఉండవు. మనదగ్గర ఉన్న బంగారం, వెండి మార్చుకుని కొత్తవి తీసుకునేందుకు అవకాశం మాత్రం ఇస్తారు. కొందరు ప్రైవేటు వ్యాపారులు మాత్రమే నగదుపై కొంటున్నారు. దేశంలోనే తొలిసారిగా వెండి నాణేలు, కడ్డీలు, ఆభరణాలను తిరిగి కొనుగోలు చేసే (బైబ్యాక్) కార్యక్రమాన్ని బులియన్ రిఫైనరీ సంస్థ ఎంఎంటీసీ-పాంప్ బుధవారం ప్రారంభించింది. తొలుత 7 నగరాల్లో ఈ సేవలు ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. త్వరలో దేశవ్యాప్తంగా ఈ సేవను విస్తరిస్తామని ప్రకటించింది. కోల్‌కతా, భువనేశ్వర్, గువాహటి, లుధియానా, అహ్మదాబాద్, ముంబయి, దిల్లీల్లోని ఎంపిక చేసిన బ్రాండ్ స్టోర్లు, ఆభరణాల స్వచ్ఛతా ధ్రువీకరణ కేంద్రాల్లో తొలుత ఈ సేవలు లభిస్తాయి. ఇదీ విధానం: వినియోగదారులు తమ వద్ద ఉన్న వెండి వస్తువులను, ఎంఎంటీసీ-పాంప్ స్వచ్ఛతా ధ్రువీకరణ కేంద్రాలకు తీసుకెళ్తే, ఎక్స్‌రే ఫ్లోరోసెన్స్ (ఎక్స్ఆర్ఎఫ్) సాంకేతికత వినియోగించి, వాటి స్వచ్ఛతను నిర్ధారిస్తారు. ఈ కేంద్రాలు తగిన భద్రతా నిఘా మధ్య ఉంటాయి.

## స్మార్ట్‌టీవీల్లో ఇకపై 90 సెకన్ల యూట్యూబ్ యాడ్స్

**న్యూఢిల్లీ:** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్‌టీవీల్లో సుదీర్ఘ అన్‌స్కిప్పబుల్ యాడ్స్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా 90 సెకన్ల వరకు స్కిప్ చేయలేని యాడ్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలిసింది. ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఈతరహా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, దీనిపై యూట్యూబ్ నుంచి అధికార ప్రకటన రావాల్సిఉంది. ఇప్పటి వరకు స్మార్ట్‌టీవీల్లో 30 సెకన్ల అన్‌స్కిప్పబుల్ యాడ్స్ మాత్రమే వస్తున్నాయి. దాని స్థానంలో 90 సెకన్ల పాటు ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 20 నిమిషాల నుంచి 40 నిమిషాల నిడివి కలిగిన వీడియోలకు ఈ తరహా యాడ్స్‌ను పుష్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు 90 సెకన్ల యాడ్స్ కనిపిస్తున్నాయి. సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు సంప్రదాయ ప్రకటనదారులను ఆకర్షించడం.. మరోవైపు యాడ్స్ వద్దనుకునే యూజర్లను ప్రీమియం వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ మార్పు చేస్తున్నట్లు టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీన్ని కేవలం స్మార్ట్‌టీవీలకే పరిమితం చేస్తారా? లేదంటే మొబైల్‌కూ వర్తింపజేస్తారా? చూడాలి మరి.




### పీపీఎఫ్ ఖాతా ఎన్నిసార్లు పొడిగించుకోవచ్చు?

# వడ్డీ ఎంతొస్తుంది?



**న్యూఢిల్లీ:** దీర్ఘకాలంలో మంచి నిధిని నిర్మించడానికి ఉన్న మార్గాల్లో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఒకటి ఇది కేంద్ర ప్రభుత్వ మద్దతు, హామీ ఉన్న పథకం కావడంతో మీ సొమ్ముకు భరోసా ఉంటుంది. పైగా ఈ పథకంలో రాబడులపై పూర్తిగా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలూ (పాత పన్ను విధానంలో) పొందొచ్చు. సాధారణంగా ఈ పథకం కాలవ్యవధి 15 ఏళ్లు. దీన్ని మరికొంత కాలం పొడిగించుకోవచ్చు. ఇలా ఎంతకాలం పొడిగించుకోవచ్చు? తద్వారా ఎంత మొత్తం సమకూరుతుంది?

ఎక్కడ తెరవొచ్చు?

పీపీఎఫ్ ఖాతాను పోస్టాఫీసులో గానీ, ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో గానీ తెరవొచ్చు. పూర్తి కాలవ్యవధి 15 సంవత్సరాలు. ఏడాదికి కనీస డిపాజిట్ కింద రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. వడ్డీ ఏడాదికి ప్రస్తుతం 7.10% (3 నెలలకు ఒకసారి ప్రభుత్వం వడ్డీ నిర్ణయిస్తుంది.) లభిస్తోంది. ఈ డిపాజిట్‌కు, వడ్డీకి ప్రభుత్వం హామీ ఉంటుంది కాబట్టి 100% రిస్క్ లేదు. ఆర్థిక సంవత్సరం (మార్చి 31వ తేదీ) పూర్తికాగానే వడ్డీ జమ అవుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో పీపీఎఫ్ ఖాతాలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

40 ఏళ్లు.. పదవీ విరమణ ప్రణాళిక సిద్ధమేనా?

పీపీఎఫ్ ఖాతా 15 ఏళ్లకు మెచ్యూర్ అవుతుంది. గడువు తర్వాత మూసేయొచ్చు. కావాలంటే పొడిగించుకోవచ్చు. ఐదేళ్ల బ్లాక్ చొప్పున ఎన్నిసార్లయినా పొడిగించుకునే వీలుంది. ఖాతాను పొడిగించాలంటే మెచ్యూరిటీకి ఏడాదిలోపు పొడిగింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. పొడిగించే కాలానికి డిపాజిట్ చేయొచ్చు. చేయకుండా కూడా కొనసాగించొచ్చు. మధ్యలో ఏదైనా అవసరం ఏర్పడితే అవసరాల నిమిత్తం ఒక బ్లాక్‌లో గరిష్ఠంగా 60% బ్యాలెన్స్‌ని విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఎంత వడ్డీ వస్తుంది?

ప్రస్తుతం పీపీఎఫ్ ఖాతాలో జమయ్యే మొత్తంపై 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. 15 ఏళ్ల పాటు ఈ ఖాతాలో గరిష్ఠ డిపాజిట్ మొత్తం అయిన రూ.1.50 లక్షలు చొప్పున జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ.40.68 లక్షలు వస్తుంది. ఇందులో మీ అసలు 22.50 లక్షలు కాగా.. వడ్డీ రూ.18.18 లక్షలు లభిస్తుంది.

ఆప్షన్-1: ఒకవేళ మీరు మీ పీపీఎఫ్ ఖాతాను 5 సంవత్సరాలు పొడిగించి సంవత్సరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడిని కొనసాగిస్తే 20 ఏళ్ల తర్వాత సుమారు రూ.67 లక్షలు వరకు పొందొచ్చు. మరో 5 ఏళ్లు అంటే, 25 ఏళ్ల వరకు ఇదే పెట్టుబడితో కొనసాగిస్తే మెచ్యూరిటీ సుమారు రూ.1.03 కోట్లు వస్తుంది.

ఆప్షన్-2: ఒకవేళ మీరు మెచ్యూరిటీ తర్వాత ఎలాంటి పెట్టుబడులూ పెట్టకుండా మరో 5 ఏళ్ల పాటు పీపీఎఫ్ ఖాతాను కొనసాగిస్తే.. అసలూ వడ్డీ కలిపి 20 ఏళ్లకు రూ.57.32 లక్షలు వస్తుంది. పొడిగించిన ఐదేళ్ల కాలానికి దాదాపు రూ.16 లక్షలు వడ్డీ లభిస్తుంది. మరో ఐదేళ్లు అంటే 25 ఏళ్లకు రూ.80 లక్షలు వరకు సమకూరుతుంది. చివరిగా: మీకు ఎలాంటి ఆర్థిక అవసరాలు లేకుండా ఉంటే పీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ తర్వాత కూడా పొడిగించడమే మంచిది.

# కీలక రేట్లలో ఈసారి మార్పుల్లేవు





**న్యూఢిల్లీ:** "మార్చిలో అంతర్జాతీయ ఉద్రిక్తతలు తీవ్రతరమై, పరిస్థితులు అధ్వానంగా మారాయి. కీలక నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాల వల్ల, మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. అయినా అంతక్రితం సంక్షోభాలతో పోల్చితే, మన ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయి. ఇతర దేశాలతో పోల్చినా షాక్‌లను తట్టుకునే విషయంలో భారత్ గొప్ప నిలకడ ప్రదర్శిస్తోంది." ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులు వడ్డీరేట్లు నిర్ణయించడానికి కీలకమైన విధాన రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) యథాతథంగా కొనసాగించింది. ఇంధన సరఫరా, ద్రవ్యోల్బణం, దేశ వృద్ధిరేటుపై ఇరాన్ యుద్ధ పరిణామాల ప్రభావం ఎలా ఉంటుందో అంచనా వేసేందుకు 'వేచిచూసే ధోరణి'ని ఎంచుకుంది. సోమవారం నుంచి జరుగుతున్న ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) సమీక్షలో రెపో రేటును 5.25% వద్దే కొనసాగించడానికి ఆరుగురు సభ్యులూ ఏకగ్రీవంగా అంగీకరించారు. ఇంధన ధరలు పెరగడం, రూపాయి బలహీనపడడం, వాణిజ్య అంతరాయాలు ఇందుకు నేపథ్య. విధాన ధోరణిని 'తటస్థంగా' కమిటీ కొనసాగించింది.

వృద్ధి అంచనాల తగ్గింపు

ప్రస్తుతానికి ద్రవ్యోల్బణం నిర్దేశిత లక్ష్యంలోపే ఉన్నా, చమురు ధరల కదలికలకు అనుగుణంగా మారొచ్చు. దీని వల్ల గిరాకీ నెమ్మదించి, పెట్టుబడుల రికవరీ ఆలస్యం కావొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. అందుకే వృద్ధిరేటు అంచనాలు తగ్గించింది. ఇంధన వ్యయాలతో పాటు పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాబోయే నెలల్లో మదింపు చేయగలమని పేర్కొంటూ, వేచిచూసే ధోరణికి మొగ్గుచూపినట్లు వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.9 శాతంగా అంచనా వేసింది. 2025-26 అంచనా వృద్ధిరేటు 7.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని 2026-27కు 4.6 శాతంగా అంచనా వేసింది. ఆర్‌బీఐ లక్ష్యమైన 2-6% మధ్యే ఉండడం ఊరట కలిగించే అంశం. 2025-26 తొలి 11 నెలల్లో సగటు ద్రవ్యోల్బణం 1.95 శాతమే. తొలిసారిగా ప్రధాన ద్రవ్యోల్బణ అంచనాలనూ ఆర్‌బీఐ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతంగా పేర్కొంది. గతంలో అనిశ్చితులు ఎదురైనపుడు ఉన్న శక్తితో పోలిస్తే, ప్రస్తుతం భారత్‌కు తట్టుకునే శక్తి అధికంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ముడి చమురు అధిక ధరల వల్ల, దిగుమతి ఆధారిత ద్రవ్యోల్బణం - కరెంట్ ఖాతా లోటు పెరగొచ్చని పేర్కొన్నారు. ఇంధన మార్కెట్లు, ఎరువులు, ఇతర కమొడిటీలపై, వ్యవసాయం, సేవలపైనా ప్రభావం పడొచ్చన్నారు. దేశీయ ఉత్పత్తి తగ్గొచ్చని అభిప్రాయపడ్డారు.

రూపాయిపై జోక్యం ఉండదు: బలమైన స్థూల ఆర్థిక మూలాలున్నప్పటికీ.. అంతక్రితం ఏడాదులతో పోలిస్తే 2025-26లో రూపాయి మారకపు విలువ అధికంగా క్షీణించిందని అన్నారు. కరెన్సీ విలువల్లో అధిక హెచ్చుతగ్గులు కనిపిస్తేనే ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందన్నారు. 'మధ్య నుంచి దీర్ఘకాలం పాటు వడ్డీ రేట్లు తక్కువ స్థాయుల్లోనే ఉంటాయ'ని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణ పరిస్థితులే ఇందుకు కారణమన్నారు. 'ప్రస్తుతానికి తటస్థంగా ఉన్నాం. ఎటు వైపైనా వెళ్లవచ్చు. అయితే దీర్ఘకాలం పాటు తక్కువ రేట్లే కొనసాగే అవకాశాలు ఉన్నాయ'న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనా 6.9%, ఆశావహ దృక్పథంతో వెల్లడించిన అంచనా కాదని స్పష్టం చేశారు. మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని.. వృద్ధిని కొనసాగిస్తూనే ధరల ఒత్తిళ్లను తట్టుకునే శక్తీ ఉందని అన్నారు. గతేడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా ఆర్‌బీఐ 125 బేసిస్ పాయింట్ల మేర రేట్ల కోత చేపట్టగా, బ్యాంకులు అందులో 90 బేసిస్ పాయింట్ల ప్రయోజనాన్ని రుణ స్వీకర్తలకు అందించగలిగాయని అన్నారు. డిపాజిట్ల విషయంలో 100 బేసిస్ పాయింట్లకు మించి అమలు చేశాయన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణను విధాన నిర్ణయం విషయంలో పరిగణనలోకి తీసుకున్నామని మల్హోత్రా పేర్కొన్నారు. 'ఉదయం 5:30 గంటలకు సంతోషకర వార్త విన్నాం. అది పూర్తిగా ఆశ్చర్యకర విషయం అయితే కాదు. అయితే దానిని కొంత వరకు లెక్కలోకి తీసుకున్నామ'ని ఆయన అన్నారు. కాల్పుల విరమణ తర్వాత, పరపతి నిర్ణయం తీసుకున్న తొలి కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐయే కావడం విశేషం. 2026- 27లో తొలి ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష ఇదే.

చమురు ఏ 85.. రూపాయి ఏ 94

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చమురు బ్యారెల్ సగటు ధర 85 డాలర్లుగా ఉండొచ్చని, డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 94 వద్ద ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. 2025-26 ద్వితీయార్థంలో చమురు సగటు ధర 70 డాలర్లుగా, రూపాయి మారకపు సగటు విలువ 88 వద్ద ఉండొచ్చని అంచనా వేసింది. 2025-26లో అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 9.88% తగ్గింది. ఇది 14 ఏళ్లలోనే భారీ వార్షిక క్షీణత. 2025 అక్టోబరు-డిసెంబరులో 63 డాలర్ల వద్ద ఉన్న చమురు ధర గత నెలలో 100 డాలర్ల ఎగువకు చేరింది.

## గెలిస్తే ఆరు గ్యారెంటీలు అమలుచేస్తాం

వ్యక్తంచేశారు. "బెంగాల్ మార్పును కోరుకుంటోంది. ఈ క్రమంలో భాజపా భారీ విజయాన్ని మనం తప్పకుండా చూస్తాం. నం దిగ్రామ్‌లో 5ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు.. భవానీపుర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుంది. ఇవి సాధారణ ఎన్నికలు కావు. అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయి. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోంది. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోంది. భాజపా అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం. బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్ల గడిచినా తొలగిపోవు" అని మోదీ వెల్లడించారు.

### డబుల్- ఇంజిన్ సర్కార్

"ఒక్కసారి డబుల్- ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయి. అవి ప్రతిఒక్కరికీ ఉపయోగపడేవే. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నాను. భాజపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల భయాలను పూర్తిగా తొలగించి నమ్మకాన్ని కలిగించడంతో పాటు చట్టబద్ధమైన పాలనను కొనసాగిస్తాం. భాజపా ప్రభుత్వంలో పని చేసే యంత్రాంగం ప్రజలకు కచ్చితంగా జవాబుదారీగా వ్యవహరిస్తుంది. అన్యాయం జరిగిన ఆడబిడ్డల కేసులను రీఓపెన్ చేస్తాం. అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతాం. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలు, అవినీతి చేసిన వారందరినీ జైలుకు పంపిస్తాం. అది మంత్రులైనా, వారి వాచ్‌మెన్‌లైనా సరే.. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కలిగిస్తాం. కానీ చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతాం. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తాం" అని హామీ ఇచ్చారు.

# బిట్‌కాయిన్ సృష్టికర్త అతడేనా..?
# ఎందుకీ అజ్ఞాతవాసం..!



**న్యూఢిల్లీ:** క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ సృష్టికర్త సతోషీ నకమోటో ఎవరో తెలుసుకోవడానికి కొన్నేళ్లుగా టెక్ ప్రపంచం అన్వేషిస్తూనే ఉంది. ఆ కరెన్సీ క్రియేటర్ ఇతడే అంటూ న్యూయార్క్ టైమ్స్ కథనం ఓ పేరు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. బ్రిటిష్ క్రిప్టాలజిస్ట్ అయిన ఆడమ్ బ్యాక్ అని పేర్కొంది. కొన్ని నెలల పాటు జరిపిన దర్యాప్తులో ఈ విషయాన్ని గుర్తించినట్లు, ఈ వాదనకు సరిపోయే ఆధారాలున్నాయని ఆ కథనం వెల్లడిస్తోంది. క్రిప్టో కమ్యూనిటీలో ఆడమ్ బ్యాక్ ఫేమస్. బిట్‌కాయిన్ సృష్టికి కారణమైన ఆలోచనలకు, తొలినాళ్లలో అతడు పనిచేసిన అంశాల ఆధారంగా అతడే క్రియేటర్ కావొచ్చని పేర్కొంది. బిట్‌కాయిన్ తొలినాళ్లలో నకమోటో పంపిన ఈ-మెయిళ్లను పరిశీలించింది. అప్పుడు అతడు వాడిన ముద్రలు, పంపిన ఈ-మెయిళ్లను బట్టి బ్రిటన్, అమెరికా తూర్పు లేదా పశ్చిమతీరానికి చెందినవాడని భావిస్తుంటారు. నకమోటో తన ఈమెయిళ్లలో కొన్ని పదాల్లో బ్రిటిష్ అక్షరక్రమాన్ని వాడేవాడు. ఉదాహరణకు- ఫేవర్ అనే పదంలో యూను జోడించేవాడు. అదే అమెరికన్లయితే యూ ఉపయోగించరు. అందుకే కొందరు నకమోటో బ్రిటన్ వాడని అనుమానిస్తుంటారు. గతంలో బ్యాక్ ఆన్‌లైన్‌లో వాడిన పదజాలం కూడా నకమోటో వాడిన భాషకు దగ్గరగా ఉందని అంతర్జాతీయ మీడియా కథనం తెలిపింది. సతోషీ నకమోటో 31వేల లైన్ల కోడ్‌తో బిట్‌కాయిన్‌ను సృష్టించాడు. అతడి సంతకంతో కూడిన 'బిట్‌కాయిన్ పీ2పీఈ ఇ-క్యాష్ పేపర్' 2008లో విడుదలైంది. ఆ పేపర్‌లో బ్యాక్ పేరు ఉండటం గమనార్హం. ఆ సమయంలో సతోషీ.. బ్యాక్‌ను సంప్రదించినట్లు గుర్తించింది. ఇలా సంప్రదించినట్లు పేర్కోవడం వల్లే సతోషీ, బ్యాక్ వేర్వేరు వ్యక్తులనే అభిప్రాయం ఇన్నాళ్లు కొనసాగింది. బిట్‌కాయిన్ సృష్టికర్తగా గుర్తింపును దాచిపెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా ఈ ప్రయత్నాలు జరిగాయని ఆ కథనం వెల్లడించింది. ఇలా పలు వివరణలను పేర్కొంది. బ్యాక్ మాత్రం తాను సతోషీని కాదని పదేపదే ఖండిస్తున్నారు.

అజ్ఞాతంలో ఉండటం వెనక కారణమేంటో..?

నకమోటో ఇప్పటికీ అజ్ఞాతంలో ఉండటానికి బిట్‌కాయిన్ విలువ ఓ కారణం కావొచ్చు. బిట్‌కాయిన్ సృష్టించిన సంపద అతడికి నేరగాళ్లు లేదా ప్రభుత్వాల నుంచి తీవ్ర ఇబ్బందులు కలిగించొచ్చు. అతడికి బిట్‌కాయిన్‌పై ఆసక్తి తగ్గటం వల్ల ఆ ప్రాజెక్టును వదిలిపెట్టి ఉండొచ్చన్నది కొందరు క్రిప్టో నిపుణుల నమ్మకం. కోడ్ రోజురోజుకీ క్లిష్టంగా మారుతుండటం, నియమనిబంధనల్లో లోపాలు ఉండటం అతడిని కలచివేసి ఉండొచ్చు. కొందరు మాత్రం నకమోటో మారుపేరుతో ఇప్పటికీ చురుగ్గానే ఉన్నాడని అనుకుంటుంటారు.

## ఎన్‌బీఎఫ్‌సీలకు కొత్త మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్, బ్యాంకింగేతర రంగాల్లో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్ లిస్టింగ్ అంశంపై ఇంకా స్పష్టత లేని నేపథ్యంలో, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) కోసం కొత్త ముసాయిదా తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలను వివిధ రకాలుగా వర్గీకరిస్తామన్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విస్తరించిన టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్, ప్రైవేట్‌గానే కొనసాగుతుందా లేదా పబ్లిక్ ఇష్యూకు (లిస్టింగ్) వెళుతుందా అనే అంశంపై స్పష్టమైన వివరాలు వెల్లడించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ నిరాకరించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, అప్పర్ లేయర్ విభాగంలో ఉన్న 15 సంస్థల్లో ఒకటైన టాటా సన్స్, గతేడాది సెప్టెంబరు 30 నాటికే స్టాక్ మార్కెట్లో నమోదు కావాల్సి ఉంది. ఈ విభాగంలోని మిగిలిన సంస్థలన్నీ ఇప్పటికే ఈ నిబంధనను పాటించాయి. లైసెన్స్ రద్దయ్యే వరకు టాటా సన్స్, తన వ్యాపారాన్ని కొనసాగించొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ గతంలో పేర్కొన్నారు. గడువు ముగిసి 6 నెలలు దాటినా, ఈ అంశంపై వ్యాఖ్యానించేందుకు బుధవారం నిరాకరించారు. ఫినో పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ రిషీ గుప్తా అరెస్టుపై గానీ, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా మారాలనే ఆ బ్యాంక్ లక్ష్యంపై ఈ అరెస్టు ప్రభావం గురించీ మల్హోత్రా స్పందించలేదు.

బ్యాంకు బోర్డుల ప్రక్షాళన..

బ్యాంకుల బోర్డు సమయాన్ని మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు, వ్యూహాలు, నష్టభయం నిర్వహణపై మరింత దృష్టి సారించేలా మార్గదర్శకాలు సవరించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. వీటికి సంబంధించిన ముసాయిదాను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి 'బ్యాంక్ పనితీరులో నైతిక కారణాలను ప్రస్తావిస్తూ' మార్చి 17న తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో భాగంగా.. దాదాపు 9,000 పాత నియంత్రణ నిబంధనలను కుదించి, 238 మాస్టర్ డైరెక్షన్లుగా క్రోడీకరించే ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. పర్యవేక్షణ సూచనలకు సంబంధించి 9 విభాగాలకు చెందిన 64 మాస్టర్ డైరెక్షన్స్ ముసాయిదాలను ప్రజల అభిప్రాయాల కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

ఎంఎస్ఎంఈలు, మనీ మార్కెట్‌కు ఊతం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)కు సకాలంలో నిర్వహణ మూలధనాన్ని అందించే ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ ప్లాట్‌ఫారమ్‌లో వారు మరింతగా పాల్గొనేలా చూసేందుకు ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన చేసింది. ఇందులో నమోదు చేసుకునేటప్పుడు ఎంఎస్ఎంఈలకు ముందస్తు తనిఖీ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. టర్మ్ మనీ మార్కెట్ పరిధిని, లిక్విడిటీని మరింత విస్తరించడంలో భాగంగా బ్యాంకేతర సంస్థలైన ఏఐఎఫ్ఐలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలతో సహా ఎన్‌బీఎఫ్‌సీలను ఈ మార్కెట్లో పాల్గొనేందుకు అనుమతించనున్నట్లు మల్హోత్రా తెలిపారు ప్రస్తుతం ఈ మార్కెట్లో బ్యాంకులు, స్టాండ్‌అలోన్ ప్రైమరీ డీలర్లకు మాత్రమే అవకాశం ఉంది.

# చందుర్తి మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- విద్య, వైద్య రంగాలకు పెద్దపీట : రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 99 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి



**చందుర్తి, ఏప్రిల్ 10 (జనంసాక్షి):**
మండల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వంలో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగా విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18 లక్షల 47 వేల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం 99 మంది లబ్ధిదారులకు 32 లక్షల 45 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి రెండు సమాంతరంగా జరుగుతున్నాయని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా 1737 కోట్ల నిధులు మంజూరు చేసి, రుద్రంగి నాగారం చెరువు, మర్రిపల్లి, చందుర్తి ప్రాజెక్టులను పూర్తి చేశారని గుర్తు చేశారు. కానీ గత పది సంవత్సరాల్లో గత ప్రభుత్వం వేములవాడ ప్రాంతంలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో ఒకే మండలంలో చందుర్తి, రుద్రంగి గ్రామాల్లో రెండు జూనియర్ కళాశాలలను మంజూరు చేశారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రామన్నపేట, సనుగుల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కళాశాల వరకు పొడిగించాలని అధ్యాపకులు కోరగా, వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి రామన్నపేట వరకు వచ్చే బస్సును చందుర్తి వరకు, సనుగుల-వేములవాడ బస్సును విద్యార్థులకు ఉపయోగపడేలా చందుర్తి ప్రభుత్వ కళాశాల వరకు పొడిగించాలని సూచించారు.
గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి ఒకే మెనూ ఉండేలా డైట్ ప్లాన్ అమలు చేస్తూ డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించగా, నేడు ప్రజా ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్‌వోసీలను మంజూరు చేస్తున్నట్లు వివరించారు.
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నామని, రాష్ట్రంలో ఉచిత బస్సు ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణాలు జరిగాయని తెలిపారు. నూతన రేషన్ కార్డులు మంజూరు చేశారని, రూ.14,600 కోట్లు ఖర్చు చేసి సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని వివరించారు. చందుర్తి మోత్కరావుపేట రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. హామీ పథకం ద్వారా వేములవాడ నుంచి సిరికొండ మధ్య 100 అడుగుల వరకు రోడ్డు నిర్మాణానికి 160 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కేటీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ తామే నిధులు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చందుర్తి మండల కేంద్రంలో సర్వే నంబరు 176 సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. భవిష్యత్ అవసరాల కోసం మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. పేద ప్రజలకు ఇచ్చిన ప్రభుత్వ భూములను ముట్టుకోవద్దని హెచ్చరించారు. చందుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి సత్యం, ఉప సర్పంచ్ బత్తుల క్రాంతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు గొట్టె ప్రభాకర్, మండల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




## ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించాలి

**మొగిలి లక్ష్మణ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాజన్న సిరిసిల్ల జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు రేవోజు సదానందం అధ్యక్షతన గురువారం వేములవాడలోని గవర్నమెంట్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ కార్యవర్గం పలు తీర్మాణలను ఆమోదించారు. వాటిలో ప్రాథమిక పాఠశాలలన్నింటిలో ప్రిప్రైమరీ తరగతులు ప్రారంభించాలని,పదవ తరగతిలో ఫిజిక్స్, బయోలజీలలో 100 మార్కులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠశాలలకు ఉచిత విధ్యుత్ అందించాలని, ప్రతి పాఠశాలలో ఒక్కరైనా బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సీ నివేదికను తెప్పించుకుని వెంటనే పిఆర్సీని ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న డి ఏ లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని,వివిధ తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్ వార్షిక నివేదిక సమర్పించారు. అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు హాజరై వార్షిక నివేదికలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో యాదగిరి, రామంచ రవీందర్, ఎంఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ గౌడ్,ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

# ప్రముఖ ఛానల్‌కు 'కసిరెడ్డి' లీగల్ నోటీసులు

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 09 (జనంసాక్షి) :** ప్రసారమాధ్యమాన్ని అడ్డుగా పెట్టుకుని నిరాధార ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగించారని, అందువల్లనే వారికి లీగల్ నోటీసులు పంపడం జరిగిందని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భాజపా సీనియర్ నేత కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం శేర్లింగంపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... తనపై ఫేక్ న్యూస్ ప్రసారం చేసి, తన పరువుకు తీవ్ర నష్టం కలిగించిన సివిఆర్ న్యూస్ తెలుగు యాజమాన్యానికి, ఎడిటర్, ఆంకర్, రిపోర్టర్ లకు లీగల్ నోటీసులు పంపించడం జరిగిందని వివరించారు. శేరిలింగంపల్లి ప్రాంతంలోని ఒక ఫౌండేషన్ నిర్వాహకుడు, మరో సెల్ ఫోన్ స్టోర్స్ యజమానితో కలిసి ఫేక్ ఎల్ఆర్ఎస్ దందా చేస్తున్నారని గత కొంతకాలంగా తప్పుడు ప్రసారం చేయడాన్ని ఆయన తీవ్రంగా గర్హించారు. ప్రజాక్షేత్రంలో ప్రజా సంక్షేమంకోసం, సామాన్యుల మేలుకోరి అనేక ఉద్యమాలను, పోరాటాలను, నిరసన కార్యక్రమాలను చేపట్టే తాను ఏ రోజు కూడా ఏ ఒక్క తప్పుడు వ్యక్తితో భాగస్వామ్యాలు పంచుకున్న దాఖలాలు లేవన్నారు. ఓ ఫౌండేషన్ ప్రతినిధులకు, ఓ సెల్ ఫోన్ స్టోర్ యాజమాన్యానికి తనతో ఎలాంటి సంబంధాలు లేవని, పరిచయం ఉన్నంత మాత్రాన భాగస్వామ్యల వ్యాపారాలు కొనసాగించే అలవాటు తనకు లేదన్నారు. వారితో కలిసి తాను ఫేక్ ఎల్ఆర్ఎస్ దందా చేస్తున్నానని పదేపదే సివిఆర్ న్యూస్ లో ప్రసారం చేయడం ద్వారా తనకు వ్యక్తిగత ప్రతిష్ట భంగం కలిగిందని, తన కుటుంబం కూడా మానసికంగా ఇబ్బందులను ఎదుర్కొంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సివిఆర్ న్యూస్ లోని సదరు వీడియోను తొలగించి, క్షమాపణలు వ్రాతపూర్వకంగానూ, తమ ఛానల్ ద్వారానూ 7 రోజుల్లో ప్రకటించాలని, లేనిచో క్రిమినల్ మరియు 25 లక్షల డిఫమేషన్ నష్టపరిహారం చెల్లించాలని కసిరెడ్డి డిమాండ్ చేశారు. వారు సరైన విధానంలో తన నోటీసులకు స్పందించని ఎడల న్యాయస్థానంద్వారా కేసును ఎదుర్కోవాల్సి ఉంటుందని కసిరెడ్డి స్పష్టం చేశారు. మా పోరాటంలో నష్టపోయిన కొంతమంది అక్రమార్కులు చేస్తున్న విషప్రచారంపై మా అభిప్రాయం, వాస్తవాలు తెలుసుకొని మునుముందు వార్తాకథనాలు ప్రసారం, ప్రచురణ చేయాలని తాము ఎలాంటి తప్పుడు లావాదేవీలు చేసే అవకాశం ఉండదని కసిరెడ్డి భాస్కరరెడ్డి పునరుద్ఘాటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది

- ఇందల్వాయి పి.ఏ.సి.ఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులను రాజులుగా చేసే దిశగా ప్రభుత్వం
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని రైతు సంక్షేమం తెలంగాణలోనే



**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 9 (జనంసాక్షి):**
రైతులు పండించిన వరి పంటను ఎలాంటి కోతలు లేకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేపడుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. గురువారం ఇందల్వాయి పి.ఏ.సి.ఎస్ ఆధ్వర్యంలో గన్నారం శివారులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకం వద్ద పూజలు చేసి కొనుగోలు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులను రాజులుగా చేసే దిశగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని రైతు సంక్షేమ పనులు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇది ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. తప్పకుండా రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఎక్కడలేని విధంగా మన దగ్గరే వరి అత్యధికంగా సాగు అవుతుందన్నారు. దాదాపుగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 218 కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, స్థానిక గన్నారం సర్పంచ్ సుజాత-శ్రీనివాస్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి, ముసుకు సాయి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, వాసు బాబు, ఉమ్మాజి నరేష్, హన్మండ్లు, రాంచందర్ గౌడ్, శ్యాం సన్, అంబర్ సింగ్, ఆయా గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు పూర్తిచేయాలి

**నల్లగొండ కలెక్టర్ బి.చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం ఆయన తన ఛాంబర్లో పాఠశాలల్లో సివిల్ పనులు, మరమ్మతులపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సివిల్ పనులతో పాటు, డ్రైనేజీ, కిచెన్, మూత్రశాలలు, బాత్రూమ్‌ల మరమ్మతులు, తాగునీటి సదుపాయం, కాంపౌండ్ వాల్ నిర్మాణం, సీసీ రోడ్లు, ఆర్ఓ ప్లాంట్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, కంప్యూటర్ల వంటి అన్ని అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలని చెప్పారు.ఈ పనులను వివిధ కంపెనీల సహకారంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, అంశాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని చెప్పారు. చిన్నపాటి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని, పెద్ద పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి సంబంధిత శాఖల ద్వారా అమలు చేయాలని ఆదేశించారు.మైనారిటీ హాస్టళ్లు, పీఆర్ విభాగానికి చెందిన భవనాలు, పాఠశాలల్లో డోర్లు, ఫ్లోరింగ్, డ్యూయల్ డెస్క్ బెంచీలు వంటి సదుపాయాలను మరమ్మతు చేయాలని తెలిపారు.అదేవిధంగా మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయని ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లకు వెంటనే మరమ్మతు చేయాలని, అవసరమైన చోట సోలార్ హీటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, హాస్టళ్లు, ఆరోగ్య సంస్థల్లో ఉన్న మరమ్మతు పనులను రెండు నెలల్లోపు పూర్తి చేసి, వచ్చే అకాడమిక్ సంవత్సరం నాటికి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,డీఈఓ బిక్షపతి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విజయిన్దర్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, పరిశ్రమల మేనేజర్ సతీష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కొందుర్గులో ఆర్టీసీ బస్టాండ్ స్థలం స్వాధీనం

- అక్రమ నిర్మాణాలు, ఫెన్సింగ్ తొలగింపు
- ప్రభుత్వ ఆస్తులను కాపాడి ప్రజా సౌకర్యాలకు మార్గం సుగమం

**కొందుర్గు, ఏప్రిల్ 9 జనంసాక్షి :** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని అక్రమ ఆక్రమణల నుంచి విముక్తి చేసినట్లు కొందుర్గు తహసీల్దార్ మీర్ అజాం అలీ ప్రకటించారు. గత కొద్ది రోజులుగా ఆ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకున్నట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై రెవెన్యూ యంత్రాంగం తక్షణం స్పందించింది. గురువారం ఉదయం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ తనిఖీల్లో పాముగంటి నవీన్ కుమార్ అనే వ్యక్తి ఆర్టీసీకి చెందిన విలువైన భూమిని అక్రమంగా కబ్జా చేసి ఫెన్సింగ్ వేసినట్లు నిర్ధారణ అయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ ఫెన్సింగ్‌ను తొలగించి, భూమిని తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మీర్ అజాం అలీ మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆస్తులను, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల సౌకర్యార్థం కేటాయించిన ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఎటువంటి అక్రమ నిర్మాణాలకు తావులేదు" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఆర్టీసీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ చర్యతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. స్థానికులు ఈ చర్యను సాధువుగా భావిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం

- రైతులు, పేదల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు
- వచ్చే 15వ వర్ధంతి నాటికి జమ్మికుంటలో విగ్రహం
- దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు






**తిమ్మాపూర్ ఽ మానకొండూర్, ఏప్రిల్ 9 (జనంసాక్షి):**
రైతుల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత నేత ముద్దసాని దామోదర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలను సదా కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న 15వ వర్ధంతి కార్యక్రమం రోజున జమ్మికుంటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పదివేల మందితో సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి, దివంగత నేత ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని మానకొండూరు మండలం సదాశివపల్లి జంక్షన్‌లో నెలకొల్పిన ఆయన వర్ధంతిని గురువారం ఆయన కాంస్య విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అలుగునూరులోని శ్రీ లక్ష్మీ నరసింహ కన్వెన్షన్‌లో ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజయరమణారావు మాట్లాడుతూ, పేద ప్రజలు, కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఎప్పుడో ఏర్పాటు చేయాల్సి ఉండేదని, అనివార్య కారణాలవల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నాయకత్వం వహించిన దామోదర్ రెడ్డి ఎంతోమంది నాయకులను తీర్చిదిద్దారని అన్నారు. తనతో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డి లను ఎమ్మెల్యేలుగా చేసిన ఘనత దామోదర్ రెడ్డికే దక్కుతుందన్నారు.దామోదర్ రెడ్డి వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని సగర్వంగా చెప్పారు. ప్రజలతో, పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎలా ఉండాలో, వారికి దగ్గరగా ఉండి ఎలా పనులు చేయాలో దామోదర్ రెడ్డిని చూసి నేర్చుకున్నానని తెలిపారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే పదివేల మంది కార్యకర్తలు ఒక చోటికి చేరేవారని, కమలాపూర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా తయారు చేశారని అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రెండు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన ముద్దసాని దామోదర్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని అన్నారు. ఆయనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎంతో సేవ చేశాడని గుర్తు చేశారు. దేవాలయాల్లోకి దళితులను రానివ్వలేని రోజుల్లో ఇల్లందకుంట దేవస్థానానికి దళితుడిని చైర్మన్ చేసిన ఘనత దామోదర్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు చేసిన సేవలు రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువకులు రాజకీయాల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కె. శ్రీనివాస్, పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పాతుపల్లి ఎల్లయ్య, హుజురాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బాబు, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి కాదు.. పొంగు 'లూటీ'

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హరీష్ రావు తీవ్ర విమర్శలు
- అవినీతి బాగోతం బయటపడేసరికి డిఫెన్స్‌లో పడి బూతులు, తిట్లు, పిట్టకథలు చెబుతుండ్రు



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 9 జనంసాక్షి :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని 'పొంగులేటి కాదు.. పొంగు లూటీ', 'పొగరులేటి.. బాంబులూటీ' అంటూ మాజీ మంత్రి, ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ, అత్యంత పవిత్రమైన సచివాలయంలో పొగరులేటి మాటలు విన్నామని, అంబేద్కర్, బిర్లా మందిరం, అమ్మవారు, మసీదు, చర్చి పక్కనే ఉన్నా నిజాలు దాటి అబద్ధాలు మాత్రమే మాట్లాడారని విమర్శించారు.
"సరుకు లేనప్పుడు, సమాధానం లేనప్పుడు తిట్లు ఎత్తుకుంటారు. డిఫెన్స్‌లో పడ్డాడు పొగరులేటి" అని హరీష్ రావు ఆరోపించారు. ఒక రాష్ట్ర మంత్రిగా కాకుండా రాఘవ కన్స్ట్రక్షన్ అధినేతగా మాట్లాడారని, కొడుకును కాపాడుకునే ప్రయత్నంలో పిట్ట కబుర్లు చెప్పి బయటపడాలని అనుకున్నాడని మండిపడ్డారు. "నేనొక్కడినే అవినీతి పరుడిని కాదు.. అందరూ మంత్రులు అవినీతి పరులే" అని పొంగులేటి స్వయంగా ఒప్పుకున్నట్లు హరీష్ రావు ఆరోపించారు. జూపల్లి కృష్ణారావు, సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సహా రాష్ట్రంలో అవినీతి కుంభకోణాల చిట్టా ఆయనే చదివారని, అందరినీ కలుపుకున్నాడని విమర్శించారు.
"పొంగులేటి కాదు.. పొంగు 'లూటీ' అని ఆయనే చెప్పకనే చెప్పాడు. రాఘవ కన్స్ట్రక్షన్‌లో జరిగిన అవినీతి మా అధికారులే గుర్తుపట్టారు, ఫైన్ కూడా కట్టారని సీఎం స్వయంగా చెప్పారు. అనుమతులు ఆలస్యం అవుతాయని మైనింగ్ మంత్రి చెప్పారు. రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, పీసీబీ, మైనింగ్ నాలుగు శాఖల అధికారులు ఇల్లీగల్ మైనింగ్ అని నిర్ధారించారు. పొంగులేటి చెప్పింది తప్పా? అధికారులు చెప్పింది తప్పా? సీఎం చెప్పింది తప్పా?" అని ప్రశ్నించారు. హరీష్ రావు మరింత తీవ్రంగా మండిపడుతూ, "పొగరులేటి నీవి ఇంకా చాలా ఉన్నాయి.. అన్ని బయటపెడతాం. పొగరు తగ్గించుకో పొంగులేటి. రాఘవ్‌కు మైనింగ్ లేదని ఎందుకు చెప్పలేదు? అసెంబ్లీలో ఉండి కూడా నాది కాదని చెప్పలేదు. సీఎం, మైనింగ్ మంత్రి తప్పు అని చెప్పు. కంటైనర్ మీద రాఘవ కన్స్ట్రక్షన్ పేరు ఎందుకు ఉంది? కాంగ్రెస్ జెండా ఎందుకు ఉంది?" అని సవాల్ విసిరారు. నాదార్‌గుల్ భూములు కాపాడింది బీఆర్ఎస్ పార్టీనని, నిషేధిత భూముల జాబితాలో పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని, హైకోర్టులో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కొట్లాడిందని గుర్తు చేశారు. "పొంగులూటి.. పొగరులేటి.. నీ బాంబులు అన్ని తుస్సుమన్నాయి. నీ విషయాలు చాలా ఉన్నాయి. ఇంకా ఏం కాలేదు. హైడ్రాను పంపి చిత్తశుద్ధి నిరూపించుకో. తప్పు అయితే నాలుగు శాఖల మీద చర్యలు తీసుకో. ముఖ్యమంత్రి అసెంబ్లీలో అబద్ధం ఆడారని చెప్పించు. పొగరులేటి.. ఇప్పటికైనా తప్పు ఒప్పుకో.. ప్రజలకు క్షమాపణ చెప్పు" అని హరీష్ రావు సవాల్ విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

"పాలమూరు జిల్లాను ప్రాజెక్టుల పేర్లు మార్చి పెండింగ్‌లో పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మీ కమిషన్ల కోసం రైతులను ఆగం చేయవద్దు" అని హెచ్చరించారు. వలసల జిల్లాగా మార్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని, 60 ఏళ్ల పాలనలో ఒక్క ఎకరాకు కూడా నీళ్లు అందించలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా ప్రాజెక్టు పనులు నిలిపివేయలేదని గుర్తు చేశారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో 25 టీఎంసీల రిజర్వాయర్లు నిర్మిస్తే, తొమ్మిదేళ్లలో 65 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను 30 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పూర్తి చేసింది బీఆర్ఎస్ అని అన్నారు. చేసి పంప్ హౌస్‌లు, సబ్ స్టేషన్లు పూర్తి చేశామని, ప్యాకేజీ-3లో కోటి 80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీస్తే ఏదుల రిజర్వాయర్‌లో ఆరున్నర టీఎంసీల నీటి సామర్థ్యం ఉండేదని వివరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే ఏదుల రిజర్వాయర్‌లో 35 టీఎంసీల నీరు నిల్వ ఉండేదని చెప్పారు. "ఆనాడు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టితే ఈ ప్రభుత్వంలో ఉన్న నాయకులు మాపై ఎన్నో కేసులు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర ఏళ్లలో 'పాలమూరు బిడ్డ నల్లమల పులి' అని డైలాగులు చెప్పుకోవడమే తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదు" అని ఎద్దేవా చేశారు.

### రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి..

# మెరుగైన వైద్యం అందించాలి

- ఆరోగ్య అవగాహన కల్పించాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ వారోత్సవాలు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 09 (జనం సాక్షి) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ట్రాన్స్ జెండర్స్ కోసం ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తాండూరు నడిబొడ్డున 14.14 ఎకరాలు

# ప్రభుత్వ భూములే ?




## 107 ఇండ్లకు నల్లా, విద్యుత్ కనెక్షన్లు కట్ చేసేందుకు సన్నాహాలు

- ఏప్రిల్ 24న కలెక్టర్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ
- కొత్త కౌన్సిలర్లతో బ్లాక్‌మెయిలింగ్‌కు దిగిన బీఆర్ఎస్ నాయకులు..

**తాండూరు, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** తాండూరు పట్టణ నడిబొడ్డున ఉన్న విలువైన భూములు ప్రభుత్వానివేనని రెవెన్యూ అధికారులు నివేదించారు. సర్వే నంబరు 111లో షాహుకార్‌పేట వీవీహెచ్ఎస్ పరిసరాల్లో 14 ఎకరాల 14 గుంటల భూములు ప్రభుత్వ భూములుగా తేలాయి. ఈ భూముల్లో దశాబ్దాలుగా 107 మంది గృహ నిర్మా ణాలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏప్రిల్ 24న కలెక్టర్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.

తహసీల్దార్ తారా సింగ్ సమగ్ర సర్వే నిర్వహించి 1954-55 ఖాస్రా పహాణీ ప్రకారం ఈ భూములు ప్రభుత్వానివేనని కలెక్టర్‌కు నివేదించారు. ఈ సర్వే నంబరులో 107 ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అన్న వివరాలు తెలుపాలని తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని, మంచినీటి నల్లా, విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని సూచించారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు కలెక్టర్ సమక్షంలో ఏప్రిల్ 24న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ఇప్పటికే తహసీల్దార్ నివేదిక కలెక్టర్‌కు సమర్పించడం తో రెండు-మూడు రోజుల్లో 111 సర్వే నంబరు ఆస్తులకు నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఈ సమాచారం తెలుసుకున్న 107 గృహ యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఇక్కడ ఇండ్లు నిర్మించుకున్నామని, మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందామని, ఇంటి నిర్మాణాల సమయంలో భూములు ప్రభుత్వమని తేల్చాల్సిందని, ఇప్పుడు నోటీసులు ఇవ్వడం కుదరదని మండిపడుతున్నారు.

**బీఆర్ఎస్ నాయకుల బ్లాక్‌మెయిలింగ్**

తాండూరు పట్టణంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు ఈ భూములపై గత కొన్ని సంవత్సరాలుగా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ లు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఇంటి నుంచి యాభై వేల రూపాయలు కావాలంటూ మధ్యవర్తుల ద్వారా బెదిరింపులు చేస్తున్నారని గృహయజమాను లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వాసులందరినీ కలిపి కనీసం 50 లక్షలు ఇస్తే పిటీషన్ వాపసు తీసుకుంటామని రాయభారం పంపించినట్లు తెలుస్తోంది.

**కొత్త కౌన్సిలర్లను రంగంలోకి దించారు**

పదేండ్లుగా బ్లాక్‌మెయిలింగ్ చేసినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు కొత్త అవతారం ఎత్తారు. తమ పార్టీకి చెందిన కొత్త కౌన్సిలర్లను ముందుకు నెట్టి ఈ దందాను కొనసాగించాలని ప్లాన్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్త కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలు పరిష్కరించకుండా షాహుకార్ పేట భూముల వైపు దృష్టి సారించడం వెనుక బ్లాక్‌మెయిలర్లు ఉన్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. హైకోర్టు ఆదేశాలు, తహసీల్దార్ నివేదిక, మున్సిపల్ చర్యలు ఏకకాలంలో జరగడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొన్నది.

### నాలుగు సంవత్సరాలు సాకండి..

## 30 సంవత్సరాలు సాకుతుంది

**ఆయిల్ పామ్ రైతులకు దిశానిర్దేశం చేసిన ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి**



కొత్తపేటలోని వైష్ణవి కన్వెన్షన్‌లో ఆయిల్ పామ్ సాగులో సమస్యలు-పరిష్కారాలు పై సదస్సు ను నల్గొండ జిల్లా ఆయిల్ పామ్ ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షుడు గురువారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్, జంగా రాఘవ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై, సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు భవిష్యత్తులో రైతులకు స్థిరమైన ఆదాయం అందించే బంగారు పంటగా మారుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ చెట్లను నాలుగు సంవత్సరాలు పోషించండి, 30 సంవత్సరాల వరకు అది మిమ్ములను సాదుతుందని వారు అన్నారు. కల్లి మొక్కలని అసత్య ప్రసారం జరుగుతుంది, దానిని రైతులు ఎవరు కూడా నమ్మకండి అని వారు రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను పెంచుతామని, త్వరలోనే గెలల కట్టర్ లకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వారు రైతులకు భరోసా ఇచ్చారు. మనం బ్రతకడానికి ఆహారాన్ని ఏ విధంగా తీసుకుంటామో చెట్లకు ఆహారం గా ఎరువులను సమృద్ధిగా అందివ్వాలని వారు సూచించారు. దేశీయంగా పండించే ఆయిల్ ఫామ్ కు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుందని, దీనిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వారు రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

శాస్త్రీయ పద్ధతుల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న నర్సరీలు, టెక్నికల్ సపోర్ట్ వినియోగించుకోవాలని ఆయిల్ ఫెడ్ ద్వారా లభించే కొనుగోలు హామీ, రైతులకు భరోసా ఇస్తుందని వివరించారు.

ప్రస్తుతం మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు రైతులకు అధిక లాభాలు అందించే అవకాశముందని స్పష్టంచేశారు. దీర్ఘకాలిక ఆదాయం, తక్కువ ప్రమాదం ఉండటంతో రైతులు ఈ పంట వైపు ముందుకు రావాలని సూచించారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు హాజరై, తమ సమస్యలను నేరుగా అధికారుల ముందుంచి పరిష్కార మార్గాలను తెలుసుకున్నారు. రైతులలో కొత్త ఉత్సాహం, అవగాహన పెంచింది. డబుల్ డ్రిప్ లైన్ కి సబ్సిడి, ఆయిల్ ఫామ్ తోటలలో ఉన్న కరెంటు లైన్లు సిఫ్టింగ్ కోసం రైతులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం స్పష్టమైన దృష్టి, నాయకత్వం నుండి బలమైన మద్దతు ఉండడంతో రైతులకు ఇది ఆర్థికంగా బలపడే మార్గంగా మారబోతోందని మీటింగ్ లో పాల్గొన్న పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలిపి, నివృత్తి చేసుకున్నారు. ఈ సదస్సుకు పతాంజలి డిప్యూటీ జనరల్ మేనేజర్ యాదగిరి, కృపాకర్ రెడ్డి, జోషి, సాంబ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శివ ప్రసాద్, మేక సందీప్ రెడ్డి, నర్సిరెడ్డి, విజయ్ కుమార్, గడ్డం సత్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



### జ్యోతి నగర్ వెంకటేశ్వర ఆలయంలో

# పూజారి చేతివాటం

- అమ్మవారి 10 గ్రాముల బంగారు గొలుసును తాకట్టు పెట్టిన ఘటన
- రోల్డ్ గోల్డ్‌తో మార్పిడి.. తప్పు ఒప్పుకుని గొలుసు తిరిగి అప్పగించిన వైనం
- పూజారి కిషోర్‌ను విధుల నుండి తొలగించిన ఆలయ కమిటీ

**కరీంనగర్, ఏప్రిల్ 9 (జనంసాక్షి):** నగరంలోని జ్యోతి నగర్ వెంకటేశ్వర ఆలయంలో పూజారి చేసిన చేతివాటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆలయంలోని అమ్మవారికి చెందిన సుమారు 10 గ్రాముల బంగారు గొలుసును పూజారి కిషోర్ ప్రైవేట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాని స్థానంలో రోల్డ్ గోల్డ్ ఆభరణాన్ని అమర్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు గుర్తించారు. ఈ విషయం తెలిసి కమిటీ సభ్యులు పూజారిని నిలదీయగా, మొదట ఆరోపణలను ఖండించిన కిషోర్ తర్వాత తన తప్పును ఒప్పుకున్నాడు. అనంతరం తాకట్టు పెట్టిన అసలు బంగారు గొలుసును తిరిగి తీసుకొచ్చి ఆలయ కమిటీకి అప్పగించాడు. గతంలో కూడా ఈ పూజారిపై ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్పందించిన ఆలయ కమిటీ పూజారి కిషోర్‌ను విధుల నుండి తొలగించినట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఈ సంఘటన జ్యోతి నగర్ ప్రాంతంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. స్థానికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు పూజారి చర్యను ఖండిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని, మరికొందరు ఆలయ నిర్వాహణలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ ఘటనపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. భక్తులు ఆలయంలో సురక్షిత వాతావరణం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రజలు మెచ్చేలా వైద్య సేవలు అందించాలి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు..
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ చిత్రా మిశ్రా



**చిగురుమామిడిఏప్రిల్ 09(జనంసాక్షి):** ప్రజలు మెచ్చేలా వైద్య సేవలు అందించాలని,విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సందర్శించారు.ఈ సందర్భంగా వైద్య సేవలపై పేషంట్లతో మాట్లాడారు.ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా సేవలు ఎలా ఉన్నాయి.. అని ఆరా తీశారు.అదేవిధంగా వైద్యులతోనూ మాట్లాడారు. ప్రజలు మెచ్చే విధంగా వైద్య సేవలు అందించాలని అప్పుడే వైద్యులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. దీంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. పేషంట్లకు బాధ్యతయుతంగా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఓపి గది ఇతర విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా పక్కనే ఉన్న పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఇక్కడ వైద్య సేవలపై అటు ప్రజలు ఇటు అధికారులతోనూ మాట్లాడారు..ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.రెండు చోట్ల మందులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డిపిఓ జగదీశ్వర్,తహసిల్దార్ ముద్దసాని రమేష్,ఎంపీడీవో విజయ్ కుమార్,వైద్యాధికారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రమంత పంచుతున్న సింగరేణి నిధులు

- కార్మికుల సంక్షేమానికి ఇవ్వడానికి మనసొప్పదు
- సిఐటియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్



**గోదావరిఖని, ఏప్రిల్ 09 (జనం సాక్షి ):** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు బృందం ఆర్ జీ.1 లో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలుసుకోవడానికి గ్రావిటీ ఫిల్టర్ బెడ్, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సందర్శించారు. భూపాల్ మాట్లాడుతూ సిఐటియు జెండా ఐక్య పోరాటాల అజెండా అని, ఆపోరాటాల ఫలితంగా నేడు గ్రావిటీ ఫిల్టర్ బెడ్, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం పూర్తి దశకు చేరుకుందన్నారు.కేవలం 2 కోట్ల బడ్జెట్ తో చిన్న చిన్న పెయింటింగులు మాత్రం మిగిలి ఉన్నాయన్నారు. ఇది వేసవి కాలం పూర్తిగా కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకొని వెంటనే నిధులు విడుదల చేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు.సింగరేణి కార్మికులు కష్టంతో వచ్చిన లాభాలు రాష్ట్రమంతటా పుట్నాలు బెల్లం లాగా కొడంగల్ నుండి మధిర వరకు, మెడికల్ కాలేజీ, రోడ్లు, సీసీ కెమెరాలు అని రకరకాల పేర్లతో దోపిడీ చేస్తున్నారు, అలాగే సింగరేణి సంస్థకు ఉన్నా 52 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలే అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండుచేశారు సింగరేణి యజమాన్యం కార్మికుల మౌలిక సౌకర్యాలపై యాజమాన్య నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఈయు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్,బ్రాంచ్ అధ్యక్షులు వంగల శివరామ్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు జంగపల్లి మల్లేశ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమార స్వామి, బ్రాంచ్ కమిటీ నాయకుడు గద్దె జనార్ధన్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్, పాత సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, నూతన సీవేజ్ ప్లాంట్ సందర్శించడం జరిగింది. పనులు ఎలా, ఏ విధంగా జరుగుతున్నాయని తెలుసుకున్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులు పాత్రికేయులు

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులు పాత్రికేయులని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ (ఐజెయు) నూతన కార్యవర్గాన్ని గురువారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామజిక సేవలో, సాంఘిక సేవలో ముందుండి సాంఘీక దురాచారాలను రూపుమాపడంలో పాత్రికేయులది ప్రధాన పాత్ర అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా గా పాత్రికేయులు ముందుకు సాగుతున్నరన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాపెల్లి శ్రీనివాస్ మరియు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రేగుల దేవెందర్, గోగికారి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కంకణాల సాయి శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల మల్లేశం, కోశాధికారి గడీల ప్రవీణ్, సహాయ కార్యదర్శి మదాం బాబు, కార్యవర్గ సభ్యులు తుపుకారి శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, సయ్యద్ హబీబ్ పాషా, గొంగల్ల రవికుమార్, పోకల ఆంజనేయులు, ఎనుగందుల నగేష్, ఖాజ నయిమోద్దీన్ పాల్గొన్నారు.



## రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులకు 100 చైర్స్ అందించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9(జనం సాక్షి):** కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఉన్న రిటైర్డ్ పోలీస్ సంఘ సభ్యులకు 100 చైర్స్ ను తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అందించారు. తమ సంఘ భవనం కోసం స్థలం కావాలని కోరగా అందుకు తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. 100 చైర్స్ అందించినందుకు రిటైర్డ్ పోలీసుల సంఘము ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ రిటైర్డ్ ఎస్సై ఉద్యోగుల అధ్యక్షులు, లక్ష్మణ్, ఉపాధ్యక్షులు మజార్, హల్తర్, సాయన్న, మజార్, ఆనంద్ రావు, గాంధీ గౌడ్, మధుసూదన్ గౌడ్, కోనా రెడ్డి, రాంగోపాల్ గౌడ్, రమేష్. రాంగోపాల్ గౌడ్, లక్ష్మణ్, రాఘవులు, వీరయ్య, రామ చంద్రం, ఇదాయత్ అలీ,ఉన్నారు.

### మండల తహసీల్దార్‌గా కిరణ్

మల్యాల : మల్యాల మండల తహసీల్దార్ గురువారం రోజున మండలోజు కిరణ్ కుమార్ నియమితులయ్యారు.ఆర్ఐ రాణి, తిరుపతి, సిబ్బంది ఎమ్మార్వోకు శుభాకాంక్షలు తెలిపారు.

## పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకుంటాం

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే
- రైతులకు అండగా ఉంటామని భరోసా
- ఇప్పటికే అధికారులతో సర్వే చేయించాం..రైతులు అధైర్యపడొద్దు
- రైతులు బాధల్లో ఉన్నారు..ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయొద్దు
- ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తిన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 09 (జనం సాక్షి ):** ఇటీవల అకాల వర్షంతో నష్టపోయిన ప్రతి రైతును తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని నిజామాబాద్ రూరల్ నియోజవర్గ ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. గురువారం డిచ్ పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో రైతుల పంట పొలాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎవరు కూడా అధైర్యపడొద్దని కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అన్నారు. పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే స్థానిక వ్యవసాయ,విద్యుత్, రెవిన్యూ శాఖల అధికారుల ద్వారా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ మేరకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...ఈ నెల 4 వ తేదీన అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి నియోజకవర్గంలోని రైతుల పంట పొలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. అదేరోజు తక్షణమే వ్యవసాయ,విద్యుత్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. నష్టానికి సంబంధించిన వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నాయకులు అనవసరపు రాద్ధాంతం చేస్తూ..చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమది రైతు ప్రభుత్వమని రైతులు కష్టాల్లో ఉంటే తప్పకుండా వారికి అండగా ఉంటామని చెప్పారు. ఘటన జరిగిన కొన్నిరోజులు కూడా కాకముందే బీజేపీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులు బాధల్లో ఉంటే వారికి అండగా నిలవాల్సింది పోయి చిల్లర రాజకీయాలు చేయడం హేయమైన చర్యఅని విమర్శించారు. నల్ల చట్టాలు తెచ్చి వేలాదిమంది రైతులను పొట్టనబెట్టుకున్న బీజేపీకి రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మరెక్కడా లేవన్నారు.ఇదిలా ఉంటే పంట నష్టం విషయమై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించినట్లు తెలిపారు.తప్పకుండా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో దాదాపు 2 వేల పైచిలుకు ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. డిచ్ పల్లి మండలం సుద్దపల్లి, ధర్పల్లి లోని రామడుగు, దమ్మన్నపేట, తండాలు, సిరికొండ మండలాల్లో పంట నష్టం జరిగిందన్నారు.నష్టపోయిన రైతులు అధైర్యపడకుండా ఉండాలని ప్రభుత్వం ఆదుకుంటుందని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అమృతపూర్ గంగాధర్,ప్రధాన కార్యదర్శి పోసాని శ్రీనివాస్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్,పార్టీ నాయకులు మునిపల్లి పెద్ద సాయి రెడ్డి, మునిపల్లి సాయి రెడ్డి,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వాసు బాబు,ఉమ్మాజి నరేష్,హన్మండ్లు, రాంచందర్ గౌడ్,శ్యాం సన్,అంబర్ సింగ్ ఆయా గ్రామాల సర్పంచులు,మండల కాంగ్రెస్‌నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంప్ యార్డు సమస్య పరిష్కారానికి మా పాలకవర్గం కట్టుబడి ఉంది

- కరీంనగర్ అభివృద్ధి పై విమర్శలు అనవసరం
- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** పాలకవర్గం ఏర్పడి రెండు నెలలు గడవక ముందే అసత్య ప్రచారాలు చేస్తూ విమర్శలు చేయడం తగదని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్‌లో గురువారం రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీల పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేరు ప్రస్తావించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. నగర ప్రజలు బండి సంజయ్ నాయకత్వం పై నమ్మకంతో భారతీయ జనతా పార్టీకి అధికారాన్ని ఇచ్చారని, పాలకవర్గం ఏర్పడి రెండు నెలలు గడవక ముందే అసత్య ప్రచారాలు చేస్తూ, విమర్శలు చేయడం తగదని అన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ నేతృత్వంలో పాలనను సవ్యంగా నడిపిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్ పరిస్థితి ఎలా ఉండేదో, బండి సంజయ్ ఎంపీగా ఎన్నికైన తర్వాత నగరం ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. స్మార్ట్ సిటీ, అమృత్ వంటి పథకాల ద్వారా అభివృద్ధి సాధించామని గుర్తుచేశారు. డంప్ యార్డు సమస్య గత ప్రభుత్వాల కాలంలోనే ఏర్పడిందని, దానిని పరిష్కరించేందుకు ప్రస్తుత పాలకవర్గం కట్టుబడి ఉందని తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణానికి ముందు డంప్ యార్డు తొలగింపు, డ్రైనేజీ మార్గాల మార్పు వంటి అంశాలు పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విషయం పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నప్పటికీ వాటి వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ప్రతిపక్ష నాయకులను హెచ్చరించారు. పాలకవర్గం పారదర్శకంగా, అవినీతి రహితంగా పనిచేస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో డివిజన్ కార్పొరేటర్లు ఒంటెల సత్యనారాయణ రెడ్డి, గాజ శివరాం - రామ, ఎన్నం ప్రకాష్ - లక్ష్మి, కర్రె అనిల్-పద్మ, నాంపల్లి శ్రీనివాస్ - రేణుక, పొన్నం మొండయ్య-లక్ష్మి, సోమిడి వేణు, భూపతి రవీందర్, మాసం గణేష్, బండ రమణారెడ్డి, దేశ శిల్ప వేదం, తేల లక్ష్మి-రమేష్, బిజెపి నాయకులు పండుగ నాగరాజు, కుంభం అనిల్, హమీద్, కాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రుద్రంగి ఏప్రిల్ 9 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.. గురువారం రుద్రంగి మండల కేంద్రంలో 50 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో ఒక వైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండు సమాంతరంగా జరుగుతున్నాయని అన్నారు.గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రతి ఒక్క విద్యార్థికి ఒకే మెనూ ఉండేలా డైట్ ప్లాన్ అమలు చేశారని అలాగే డైట్ మరియు కాస్మొటిక్ ఛార్జీలను పెంచారని తెలిపారు.

రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా తో పాటు విద్యార్థులకు పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందేయాలనీ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పించింది అని తెలిపారు.ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించారని నేడు ప్రజా ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంచడం జరిగింది అన్నారు..క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటుచేసి పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్వోసిలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు.. రాష్ట్రంలో ఉచిత బస్సు ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణాలు అయ్యాయని అన్నారు.. నూతన రేషన్ కార్డులు మంజూరు చేశాం అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ,మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కేఎంసీలో ర్యాగింగ్ కలకలం!

## హాస్టల్ నుంచి బహిష్కరణ

- కాలేజీ నుంచి 3 నెలల సస్పెన్షన్
- విద్యార్థుల పై చర్యలకు అధికారుల సమాయత్తం




**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 09 (జనం సాక్షి) :** వరంగల్ అధికారులు ఎన్ని కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ రాగింగ్ భూతం విద్యార్థులను వదిలిపెట్టడం లేదు . వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థుల మద్య ఘర్షణ తలెత్తింది. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను మోకాళ్ళ పై కూర్చోబెట్టి ఇబ్బందులకు గురి చేశారని జూనియర్ విద్యార్థులు కళాశాల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీనియర్ విద్యార్థులపై చర్యలకు సిద్దమవుతున్నారు. రాగింగ్ అనగానే కొత్తగా కళాశాల విద్యార్థులు సీనియర్స్ మద్య ఉంటుందని అందరూ భావిస్తారు.. ఇక్కడ మాత్రం ఎంబీబీఎస్ రెండు, మూడవ సంవత్సరాలు చదువుతన్న విద్యార్థుల మద్య రాగింగ్ జరిగింది . రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల వాట్సప్ గ్రూప్ లో మూడవ సంవత్సరం విద్యార్థుల గురించి తప్పుగా మాట్లాడుతున్నారన్న సమాచారం అందుకున్నారు .. తమ గురించి జూనియర్స్ తప్పుగా మాట్లాడడం సరియైనది కాదు.. వారికి బుద్ధి చెప్పి తీరాల్సిందే నని సీనియర్స్ నిర్ణయించుకున్నారు.. హాస్టల్ టెర్రస్ పైకి 20 మంది జూనియర్ మెడికోస్ ను పిలిచి మోకాళ్లపై కూర్చో బెట్టి తప్పయిందని.. మరోసారి ఇలా చేయమని సారీ చెప్పించు కున్నారు.. ఇతరత్రా ఇబ్బంది పెట్టారని సమాచారం ..ఇది నచ్చని కొంతమంది జూనియర్ విద్యార్థులు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి మొదలు పెట్టి దేశంలో సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు.. వరంగల్ పోలీస్ కమిషనర్ కు కూడా బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేశారు.. దీంతో కళాశాల అధికారులు రంగంలోకి దిగారు.

# ఏసీబీకి చిక్కిన అటవీ క్షేత్ర అధికారి



**బోథ్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని గురువారం అటవీ క్షేత్ర అధికారి కార్యాలయంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.. అదిలాబాద్ ఏసీబీ డిఎస్పి మధు తెలిపిన మేరకు వివరాలి ఇలా ఉన్నాయి. ఈ దాడుల్లో జూనియర్ అసిస్టెంట్ పరశురాం స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. ఉపాధి హామీ కింద మొక్కలకు నీరు అందించే పని చేసే వ్యక్తికి 5.9 లక్షల బిల్లు మంజూరైంది. ఇట్టి మంజూరైన బిల్లు విడుదల కోసం సదరు వ్యక్తి ఎఫ్ఆర్ఓ ప్రణయ్ ను సంప్రదించగా వీరు సదరు వ్యక్తి నుండి 40 వేలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు 15 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం పౌడర్ చల్లిన 15 వేల నగదును ఇచ్చి అటవీ అధికారి వద్దకు పంపారు. నగదు తీసుకున్న అధికారిని ఏసీబీ అధికారులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతడి నుండి నగదు స్వాధీనం చేసుకొని సంబంధిత అధికారి చేతులను రసాయనలతో కడిగి లంచం తీసుకున్నట్టుగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు అధికారులను కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డిఎస్పి మధు వెల్లడించారు.

# పీటీఓలో డీజీపీ సందర్శన





**హైదరాబాద్ (జనంసాక్షి) :** డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి.శివధర్ రెడ్డి గురువారం పెట్లబుర్జులోని పోలీసు రవాణా సంస్థ (పీటీఓ) గురువారం నాడు సందర్శించారు. పెట్లబుర్జు పీటీఓ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని డిజిపి ప్రారంభించారు. అనంతరం సంస్థలోని వివిధ విభాగాలను తనిఖీ చేసి, వాహనాల నిర్వహణ, సాంకేతిక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని ఆక్టోపస్ కార్యాలయాన్ని డీజీపీ బి శివధర్ రెడ్డి బుధవారం నాడు సందర్శించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అదనపు డీజీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్ కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ నూతన పరిపాలనా భవనాన్ని, అత్యాధునిక ఆయుధాల ప్రదర్శనను డీజీపీ తిలకించారు. శాట్‌కాంబ్యాట్ విభాగాన్ని, బాంబు నిర్వీర్య కేంద్రం (ఐఈడీ సెంటర్) పనితీరును పర్యవేక్షించిన ఆయన, రాష్ట్ర ఎలైట్ కమెండో ఫోర్స్ అయిన ఆక్టోపస్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీజీ అనిల్ కుమార్ ఆక్టోపస్ విభాగానికి సంబంధించిన వివిధ విభాగాలు, వాటి పనితీరును డీజీపీకి వివరించారు. ఈ పర్యటనలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, ఆక్టోపస్ ఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ రఘునందన్ రావు, శిక్షణ నిపుణులు కల్నల్ భరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక సదుపాయాలు

**పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష**



**హైదాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈఎన్‌సిలు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

# 13న బీఆర్‌ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

- జగిత్యాల టైగర్ జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీలోకి స్వాగతం అంటూ ఫెక్సీల ఏర్పాటు







**జగిత్యాల (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన బీఆర్ఎస్‌లో చేరనున్నారు.. జగిత్యాలలో ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించి, బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. రేవంత్ రెడ్డి పాలనపై అసంతృప్తితో, కేసీఆర్ నాయకత్వం బెటర్ అనే అభిప్రాయంతో ఆయన పార్టీ మారుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌతాఫ్రికా అధ్యక్షులు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో జగిత్యాల టైగర్ జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీలోకి స్వాగతం అంటూ ఏర్పాటు చేసిన ఫెక్సీలు జీవన్‌రెడ్డి చేరికకు బలం చేకూర్చుతున్నాయి. ఈనెల 13న జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ ప్రోటోకాల్‌పై అసంతృప్తి, రేవంత్ రెడ్డి తీరుతో పాటు, కాంగ్రెస్ జెండా మోసినా సరైన గుర్తింపు లేకపోవడం వల్ల జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జగిత్యాలలోని జీవన్‌రెడ్డి కార్యాలయంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించడం సంచలనం సృష్టించింది. జీవన్‌రెడ్డి రాకను బీఆర్ఎస్ నేతలు కూడా స్వాగతిస్తున్నారు. జగిత్యాల జిల్లా కాంగ్రెస్‌లో ఇది అతిపెద్ద షాక్‌గా భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా సేవలు అందించిన జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్)తో సన్నిహితంగా ఉంటూ తన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో 'జగిత్యాల నియోజకవర్గానికి చెందిన నాయకుడిగా, దక్షిణ ఆఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షుడిగా, నేను శ్రీ జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ కుటుంబంలోకి ఆదరణతో స్వాగతిస్తున్నాను ఈ చారిత్రాత్మక సందర్భంలో నా మనసు నిండా ఆనందం వెల్లివిరుస్తోంది' అని ఫ్లెక్సీని నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిరామారావు (కేటీఆర్) స్వయంగా జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్ళి, పార్టీ శ్రేణులతో కలిసి ఆయనను సాదరంగా బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలుస్తోంది. 'ఇది కేవలం ఒక రాజకీయ చేరిక మాత్రమే కాదు.. ఒక నిజాయితీపరుడైన నాయకుడికి లభించిన సముచిత గౌరవం' అని ఫ్లెక్సీల్లో రాసిపెట్టారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలపాటు అంకితభావంతో, నిస్వార్థంగా సేవలందించారు. కానీ అక్కడ గౌరవం, నిజాయితీ కోసం చేసే నాయకుడికి స్థానం లేకుండాపోయింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో నిరాడంబరంగా పనిచేసిన కార్యకర్తలకు టికెట్లు దక్కకుండా, ఆఖరుకు ఆయన స్వతంత్ర అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. 'జగిత్యాల నియోజకవర్గం నుండి వచ్చిన వ్యక్తిగా, జగిత్యాల టైగర్ అని పేరుపడిన జీవన్ రెడ్డి చేరికపై నాకు ప్రత్యేక గర్వంగా, ఆనందంగా ఉంది. ఆయన అనుభవం, నాయకత్వ లక్షణాలు బీఆర్ఎస్ పార్టీకి నిజంగా బలమైన పునాది అవుతాయి. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఆ విప్లవ స్ఫూర్తితో, జీవన్ రెడ్డి గారు ఇప్పుడు బీఆర్ఎస్ కుటుంబంలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలతో ద్రోహం చేస్తున్న నేపథ్యంలో, జీవన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి తమ అనుభవాలు పంచుకుంటే, తెలంగాణ ప్రజలకు వాస్తవం అర్థమవుతుంది. ఆ సత్యం వెలుగులోకి తెచ్చే ఆయన స్వరం బీఆర్ఎస్ పార్టీకి అమూల్యమైన ఆస్తి' అని నాగరాజు గుర్రాల తెలిపారు.




# 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలు విడుదల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక ప్రక్రియ పూర్తి అయింది. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల తుది ఫలితాలను గురువారం సాయంత్రం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన నర్సుల సెలక్షన్ లిస్టును బోర్డు https://mhsrb.telangana.gov.in/Home వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచింది. పారదర్శకత కోసం పరీక్ష రాసిన సుమారు 42 వేల మంది అభ్యర్థుల పూర్తి వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో 2024లో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, ఇప్పుడు మరో 2322 పోస్టులను భర్తీ చేసింది. దీంతో ప్రభుత్వ హాస్పిటళ్లలో నర్సుల కొరత పూర్తిగా తీరిపోయినట్టేనని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

### రికార్డు స్థాయిలో నియామకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్యారోగ్య శాఖలో ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ బాధ్యతలు చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో 12,649 పోస్టుల భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఇందులో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు సహా వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్నిరకాల పోస్టులు ఉన్నాయి. సుమారు మరో 4500 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ హాస్పిటళ్లలో సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నది రేవంత్ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హాస్పిటళ్లు అంటే కేవలం జీవోలు ఇచ్చుడు కాదు అని.. అవసరమైన భవనాలు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఎక్విప్‌మెంట్, డయాగ్నస్టిక్, డ్రగ్స్ వంటి సౌకర్యాలు అన్నీ ఉండాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు సందర్భాల్లో చెప్పారు. నిరంతర పర్యవేక్షణ, వరస రివ్యూలు, కోర్టు కేసులపై ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ వాటిని క్లియర్ చేయించడంతో ఖాళీల భర్తీ ప్రక్రియ వేగంగా జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చేయనన్ని పోస్టులను ఈ రెండేళ్లలో ఆరోగ్యశాఖలో భర్తీ చేయడం గమనార్హం. సపోర్టింగ్ స్టాఫ్ మొదలుకొని స్పెషలిస్ట్ డాక్టర్ల వరకు అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేస్తుండటంతో ప్రభుత్వ వైద్య సేవలు బలోపేతం అయ్యాయి. గతంలో ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వడానికి అడ్డంకులు చెప్పిన నేషనల్ మెడికల్ కమిషన్, కొత్తగా 10 మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లను సైతం మంజూరు చేసింది. ఈ ఏడాది మరో 250కి పైగా పీజీ సీట్ల కోసం మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఇవేగాకుండా, కొత్తగా 5 పీజీ సెంటర్లను సెకండరీ కేర్ హాస్పిటళ్లలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా జిల్లాల్లోనే స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ఇప్పటికే భర్తీ పూర్తయిన పోస్టుల వివరాలు**

| | |
|---|---|
| నర్సింగ్ ఆఫీసర్లు | 9278 |
| ల్యాబ్ టెక్నీషియన్లు (గ్రేడ్-2) | 1,542 |
| సివిల్ అసిస్టెంట్ సర్జన్లు | 425 |
| సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ | 623 |
| జూనియర్ అసిస్టెంట్లు (గ్రూప్-4) | 334 |
| ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు | 138 |
| ఫిజియోథెరపిస్టులు | 48 |
| జూనియర్ అసిస్టెంట్లు (గ్రూప్-3) | 39 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్ | 132 |
| అసిస్టెంట్ ప్రొఫెసర్లు | 28 |
| ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు | 24 |
| అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (గ్రూప్-1) | 20 |
| డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు | 18 |
| మొత్తం | 12,649 |

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు

- కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ
- పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే



**జనగామ, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాం శమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



# బహదూర్‌పల్లి స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం

- సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్ప

**మేడ్చల్, ఏప్రిల్9 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు యత్నిస్తున్నారు. మరోవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడలోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే..

- మంత్రి సీతక్క



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (జనంసాక్షి) :** తల్లిదండ్రులను వృద్దాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యా నించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370